ప్రజాశక్తి
బుధవారం 15 మే 2024
8 పేజీలు


విశాఖపట్నం


అనకాపల్లి

మహిళా చైతన్యం

◆ విశాఖలో మొత్తం ఓట్లు 20,12,373 - పోలైన ఓట్లు 14,09,118
◆ పోలైన పురుషుల ఓట్లు 6,85,877, మహిళల ఓట్లు 7,23,197
◆ ఈసారి ఎవరికి పట్టం కట్టేనో..?


విశాఖలోని కృష్ణా కాలేజీ పోలింగ్ బూత్‌లో ఓటు వేసేందుకు బారులు తీరిన మహిళలు (ఫైల్)

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

సార్వత్రిక ఎన్నికల పోలింగ్‌లో విశాఖలో మహిళా చైతన్యం వెల్లివిరిసింది. దాదాపు అన్ని నియోజకవర్గాల్లో మహిళల ఓటింగ్ అధికంగా నమోదైంది. ఈ సరళి ఎవరికి లాభం చేకూరుస్తుందన్న అంశంపై సర్వత్రా చర్చ సాగుతోంది. ఈ నెల 13న జరిగిన ఎన్నికల్లో పోలైన ఓట్లలో విశాఖ జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలైన భీమిలి, తూర్పు, పశ్చిమం, దక్షిణం, ఉత్తరం, గాజువాక, పెందుర్తిల్లో 20 లక్షలా 12 వేలా 373 ఓట్లలో 70.02 శాతం అంటే 14,09,118 ఓట్లు పోలయ్యాయి. దీంట్లో మహిళా ఓటర్లు 7,23,197 మంది ఓటింగ్‌లో పాల్గొన్నారు. పురుషులు 6 లక్షలా 85 వేలా 877 మంది ఓటేశారు. పార్లమెంట్ పరిధి చూస్తే పెందుర్తి మినహాయించి విజయ నగరం జిల్లాలోని ఎస్‌కోటను కలిపి చూస్తే 2,22,475 ఓటర్లకుగానూ పురుషులు 92,383 మంది, మహిళలు 97,723 మంది మొత్తంగా లక్షా 90 వేలా 106 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు.

పోలింగ్ సరళి...

గెలుపోటములపై ప్రధాన పార్టీల తలమునకలు

2024 ఎన్నికల్లో జిల్లాలో ఒక పార్లమెంట్, 7 అసెంబ్లీ సీట్లలో టిడిపి - జనసేన - బిజెపి కూటమి, వైసిపి ప్రధాన పార్టీలుగా తలపడ్డాయి. ఇండియా వేదికలోని కాంగ్రెస్, సిపిఎం, సిపిఐ కూడా బరిలో ఉన్నాయి. గాజువాకలో సిపిఎం, పశ్చిమంలో సిపిఐ ప్రధాన పార్టీలతో తలపడ్డాయి. ఈ నేపథ్యంలో ఆయా పార్టీల నేతలు ఎవరి లెక్కల్లో మిగతా 2లో..

భారీ భద్రత


ఎయులోని స్ట్రాంగ్ రూమ్ వద్ద గస్తీ కాస్తున్న సాయుధ పోలీసు

విశాఖ జిల్లాలోని అన్ని నియోజకవర్గాల ఇవిఎంలను ఆంధ్రా యూనివర్సిటీ ఇంజనీరింగ్ కళాశాలలో భద్రపరిచారు. అభ్యర్థుల భవితవ్యాన్ని తేల్చే వీటి వద్ద గట్టి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. అన్ని రూమ్‌లకు సీల్ వేసి సాయుధ పోలీసులు రోజంతా గస్తీ కాస్తున్నారు.


ఎయు ఇంజనీరింగ్ కాలేజీలో భద్రపరిచిన ఇవిఎంలు

రాష్ట్రంలో ఫ్యాన్ గాలి : మంత్రి బొత్స

▶ వార్త 2లో..

వైసిపి పట్ల తీవ్ర వ్యతిరేకత : నజీర్

▶ వార్త 2లో..

హోయిగొలిపిన ఝుమ్మంది నాదం

▶ వార్త 2లో..


స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద ఉక్కు ఉద్యోగులతో ఆదిత్య కాలేజీ విద్యార్థులు

'ఉక్కు' ఉద్యమానికి విశాల మద్దతు

దీక్షలకు సంఘీభావం ప్రకటించిన విద్యార్థులు వార్త మెయిన్‌లో..

ఎవరి ధీమా వారిది..!

◆ పోలింగ్ ఆధారంగా అభ్యర్థుల అంచనాలు
◆ అనకాపల్లిలో 2019లో 81, ఈ ఎన్నికల్లో 79.77 శాతం నమోదు

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి

సార్వత్రిక ఎన్నికలు పూర్తవడంతో ప్రధాన పార్టీల అభ్యర్థులు తమకున్న విజయావకాశాలపై లెక్కలు వేసుకుంటున్నారు. వైసిపి, కూటమి నుంచి పోటీచేసిన టిడిపి, జనసేన అభ్యర్థులు, బిజెపి ఎంపీ అభ్యర్థి పార్టీ బలం, సామాజిక సమీకరణలు, ప్రభావిత ఓటర్లను లెక్కగట్టి ఎవరి ధీమా వారు వ్యక్తం చేస్తున్నారు. నియోజకవర్గాల్లో పోలింగ్ శాతం ఆధారంగా తమకు వచ్చే ఓట్లను అంచనా వేస్తున్నారు. పెరిగిన పోలింగ్ శాతాన్ని పరిగణనలోకి తీసుకొని ప్రభుత్వ వ్యతిరేక, అనుకూల ఓటును అంచనా వేసేలా ఈ ఎన్నికల్లో సగటు పోలింగ్ శాతం పెరగలేదు. అనకాపల్లి లోక్‌సభ పరిధిలోని చోడవరం, మాడుగుల, అనకాపల్లి, యలమంచిలి, పాయకరావుపేట, నర్సీపట్నం, పెందుర్తి అసెంబ్లీ నియోజకవర్గాల్లో సగటు పోలింగ్ శాతాన్ని పరిశీలిస్తే మిగతా 2లో..

అనకాపల్లి లోక్‌సభ పరిధిలోని నియోజకవర్గాల వారీగా ఓటర్లు, పోలింగ్, శాతం వివరాలు

నియోజకవర్గం	ఓట్లు	పోలైన ఓట్లు	శాతం	2019లో శాతం
చోడవరం	2,17,484	1,83,643	84.44	82.88
మాడుగుల	1,88,989	1,62,577	86.02	82.99
అనకాపల్లి	2,13,714	1,59,523	74.64	77.46
యలమంచిలి	2,06,394	1,76,807	85.66	84.99
పాయకరావుపేట	2,50,744	2,05,671	82.02	81.32
నర్సీపట్నం	2,12,046	1,77,600	83.76	82.78
పెందుర్తి	3,07,545	2,08,099	67.66	74.52
మొత్తం	**15,96,916**	**12,73,920**	**79.77**	**81.00**

మొదటి పేజీ తరువాయి..

ఎవరి ధీమా వారిది..!

2019 ఎన్నికల కంటే 2024 ఎన్నికల్లో పోలింగ్ శాతం తగ్గింది. గత ఎన్నికల్లో 81 శాతం పోలింగ్ జరగ్గా ఈ ఎన్నికల్లో 79.77 శాతం నమోదైంది. గత ఎన్నికల కంటే పోలింగ్ శాతం పెరగకపోవడంతో ప్రభుత్వ వ్యతిరేకత ఏ మేరకు వుందనేది అంచనాలకు దొరకడంలేదు. అత్యధికంగా మాడుగులలో 86.02 శాతం, అత్యల్పంగా పెందుర్తిలో 67.66 శాతం పోలింగ్ నమోదైంది. ఈ ఎన్నికల్లో చోడవరం, మాడుగుల, యలమంచిలి, పాయకరావుపేట, నర్సీపట్నం నియోజకవర్గాల్లో పోలింగ్ శాతం పెరగ్గా, అనకాపల్లి, పెందుర్తి నియోజకవర్గాల్లో తగ్గింది. మహిళల పోలింగ్ శాతం పెరగడంతో ప్రభుత్వ అనుకూల ఓటని వైసిపి భావిస్తుండగా, కూటమి మ్యానిఫెస్టోకు మహిళలు వేసిన ఓటని జనసేన, టిడిపి అభ్యర్థులు చెప్పుకుంటున్నారు.

మహిళా చైతన్యం

వారున్నారు. గత 2019లో విశాఖ పార్లమెంట్ పరిధిలో 67.26 శాతం ఓటింగ్ నమోదుకాగా ఈ దఫా 71 శాతానికి పెరిగింది.

అసెంబ్లీ సెగ్మెంట్ల
వారీగా పోలింగ్ వివరాలు

భీమిలి నియోజకవర్గం పరిధిలో పురుషులు 1,78,090, మహిళలు 1,84,908, ట్రాన్స్ జెండర్లు 15 మొత్తం 3,63,013 మంది ఉండగా 75.96 సగటుతో పురుషులు 1,35,301, మహిళలు 1,40,446, మొత్తం 2,75,747 మంది ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకున్నారు.

విశాఖపట్నం తూర్పు నియోజకవర్గం పరిధిలో పురుషులు 1,42,540 మంది, మహిళలు 1,49,646 మంది, ట్రాన్స్ జెండర్లు 20 మొత్తం 2,92,206 మంది ఉండగా 68.64 సగటుతో పురుషులు 96,224 మంది, మహిళలు 1,04,324 మంది, ట్రాన్స్ జెండర్లు 15 మొత్తం 2,00,563 ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకున్నారు.

విశాఖపట్నం దక్షిణ నియోజకవర్గం పరిధిలో పురుషులు 1,06,444, మహిళలు 1,10,293 మంది, ట్రాన్స్ జెండర్లు 33, మొత్తం 2,16,770 మంది ఉండగా 63.42 సగటుతో పురుషులు 66,260, మహిళలు 71,209, ట్రాన్స్ జెండర్లు 5 మొత్తం 1,37,474 మంది ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకున్నారు.

విశాఖపట్నం ఉత్తర నియోజకవర్గం పరిధిలో పురుషులు 1,40,788, మహిళలు 1,44,979, ట్రాన్స్ జెండర్లు 22 మొత్తం 2,85,789 మంది ఉండగా 64.63 సగటుతో పురుషులు 90,124, మహిళలు 94,566, ట్రాన్స్ జెండర్లు 13, మొత్తం 1,84,703 మంది ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకున్నారు.

విశాఖపట్నం పశ్చిమ నియోజకవర్గంలో పురుషులు 1,05,202, మహిళలు 1,08,226, ట్రాన్స్ జెండర్లు 11, మొత్తం 2,13,439 మంది ఉండగా 69.78 సగటుతో పురుషులు 71,154, మహిళలు 77,781, ట్రాన్స్ జెండర్లు 07 మొత్తం 1,48,942 మంది ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకున్నారు.

గాజువాక నియోజకవర్గం పరిధిలో పురుషులు 1,67,112, మహిళలు 1,66,487, ట్రాన్స్ జెండర్లు 12, మొత్తం 3,33,611 ఉండగా 69.83 సగటుతో పురుషులు 1,14,844, మహిళలు 1,18,105, మొత్తం 2,32,949 మంది ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకున్నారు.

పెందుర్తి నియోజకవర్గం పరిధిలో పురుషులు 1,52,592, మహిళలు 1,54,948, ట్రాన్స్ జెండర్లు 5, మొత్తం 3,07,545 మంది ఉండగా 74.38 శాతం సగటుతో పురుషులు 1,11,970, మహిళలు 1,16,766, ట్రాన్స్ జెండర్లు 4 మొత్తం 2,28,740 మంది ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకున్నారు.

ఇక పార్లమెంట్ పరిధిలోకి వచ్చే ఎస్.కోట నియోజకవర్గ పరిధిలో పురుషులు 1,08,227, మహిళలు 114246, ట్రాన్స్‌జెండర్లు 2 మొత్తం 2,22,475 ఉండగా 85.45 సగటుతో పురుషులు 92,382, మహిళలు 97,723, ట్రాన్స్‌జెండర్లు 1 మొత్తం 1,09,106 మంది ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకున్నారు

పురుష, మహిళా ఓటింగ్ సరళి ఇలా..

విశాఖ జిల్లా వ్యాప్తంగా చూసుకుంటే పురుషులు 9,92,768, మహిళలు 10,19,487, ట్రాన్స్ జెండర్లు 118, మొత్తం 20,12,,373 మంది ఉండగా 70.02 సగటుతో పురుషులు 6,85,877, మహిళలు 7,23,197, ట్రాన్స్ జెండర్లు 44, మొత్తం 14,09,118 మంది ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకున్నారు.

విశాఖ పార్లమెంట్‌లో ఓటింగ్ ఇలా..

విశాఖపట్నం పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో పురుషులు 9,48,403, మహిళలు 9,78,785, ట్రాన్స్ జెండర్లు 115, మొత్తం 19,27,303 మంది ఉండగా 71.11 సగటుతో పురుషులు 6,66,289, మహిళలు 7,04,154, ట్రాన్స్ జెండర్లు 41 మొత్తం 13,70,484 మంది ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకున్నారు.

హాయిగొలిపిన ఝుమ్మంది నాదం

ప్రజాశక్తి - విశాఖపట్నం : స్వర్ణ మెలోడీస్ సంగీత సంస్థ వ్యవస్థాపకురాలు, ప్రముఖ గాయని భోగి స్వర్ణ నిర్వహణలో పౌర గ్రంథాలయంలో మంగళవారం నిర్వహించిన మూడు గంటల సినీ సంగీత విభావరి ఆహూతులను అలరించింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఉపకార్ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు, సినీ నిర్మాత కంచర్ల అచ్యుతరావు హాజరై కళాకారులను అభినందించారు. 'ఝుమ్మంది నాదం' పేరిట నిర్వహించిన ఈ సంగీత విభావరిని సంఘ సేవకులు పల్లంట్ల వెంకట రామారావు. సోషల్ మీడియా స్టేట్ చైర్మన్ సన్ మూర్తి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ప్రముఖ గాయకులు భయ్యా శ్రీనివాస్, రాధ, జ్యోతి, స్వర్ణ, మహమ్మద్ ఖాన్ తదితరులు హుషారైన గీతాలను ఆలపించి ఆద్యంతం అలరించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి కంచర్ల అచ్యుతరావు మాట్లాడుతూ కళాకారులు ఐక్యంగా కృషిచేసి సొంతంగా విశాఖలో ఆడిటోరియం నిర్మించుకోవాలని సూచించారు. గాయని భోగి స్వర్ణను సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో పత్తి ప్రసాద్, బొట్టా నాగేశ్వరరావు పాల్గొన్నారు.

రాష్ట్రంలో ఫ్యాన్ గాలి : బొత్స



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న బొత్స

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : తాజా ఎన్నికల్లో రాష్ట్ర వ్యాప్తంగా వైసిపి ఫ్యాన్ గాలి వీచిందని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ అన్నారు. మంగళవారం సాయంత్రం లాసన్స్ బే కాలనీలోని బొత్స ఝాన్సీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ జగన్ సంక్షేమం, అభివృద్ధిపై దృష్టి పెట్టి పనిచేశారని, 74 శాతం మంది మహిళలు పథకాల్లో లబ్ధి పొందారని, ఈ క్రమంలో మళ్లీ వైసిపికే ప్రజలు తమ ఓట్లు ద్వారా మద్దతునిచ్చారని భావిస్తున్నామన్నారు. ఎన్నికల సమయంలో టిడిపి ఎన్నో అబద్ధాలు చెప్పిందని, మోసపూరిత మాటలు పలికిందని, అమలవుతున్న పథకాలను ఆపించిందని ఆరోపించారు. ప్రజా జీవితంలో నిజాయితీ ముఖ్యమన్నారు. విశాఖలో వైసిపి గెలుపు ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. తాము విశాఖ అభివృద్ధికి కట్టుబడి ఉన్నామన్నారు. కూటమి ప్రలోభాలకు లొంగకుండా ప్రజలు వైసిపికి ఓట్లు వేశారని అన్నారు. ఈ ఎన్నికల్లో సామదాన దండోపాయాలను కూటమి ఉపయోగించిందని, చివరకు తాను వైసిపికి రాజీనామా చేస్తున్నట్టు టిడిపి సోషల్ మీడియాలో ప్రచారం చేశారని తెలిపారు. రైతులు, పేదల సంక్షేమం కోసమే సిఎం జగన్ పనిచేశారన్నారు. మంచి చేశానని నమ్మితేనే ఓటు వేయండని చెప్పిన ఘనత జగన్‌కే దక్కుతుందన్నారు. ఇవిఎంల మీద కూటమి విశాఖ ఎంపీ అభ్యర్థి శ్రీభరత్ అవగాహన లేకుండా వ్యాఖ్యలు చేశారన్నారు. కేంద్రంలో బిజెపికి వైసిపి గతంలో అంశాల వారీగా మాత్రమే మద్దతునిచ్చిందని తెలిపారు. వైసిపి నాయకురాలు బొత్స ఝాన్సీ లక్ష్మి మాట్లాడుతూ ఎన్నికల్లో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొనడం చైతన్యానికి చిహ్నమని తెలిపారు. ఈసారి మ్యానిఫెస్టోలోని అంశాలను అమలు చేసేందుకు కట్టుబడి ఉన్నామన్నారు. సమావేశంలో వైసిపి విశాఖ జిల్లా అధ్యక్షులు కోలా గురువులు, ఎస్.కోట వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి కడుబండి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

వైసిపి పట్ల తీవ్ర వ్యతిరేకత

టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నజీర్

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : యువత పెద్ద సంఖ్యలో ఓటింగ్‌లో పాల్గొనడం, ప్రజలు ప్రస్తుత ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకతతో భారీగా పోలింగ్ కేంద్రాలకు తరలిరావడం వంటి పరిణామాలు టిడిపి, జనసేన, బిజెపి కూటమి విజయాన్ని సూచిస్తున్నాయని టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మహమ్మద్ నజీర్ తెలిపారు. ఈ మేరకు ఆయన మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలో దాదాపు 125 నుంచి 140 అసెంబ్లీ సీట్లు కూటమి గెలుస్తుందని, 20 నుంచి 23 పార్లమెంట్ స్థానాలు వస్తాయని తెలిపారు. విదేశాల నుంచి, ఇతర రాష్ట్రాల నుంచి లక్షల సంఖ్యలో ఓటర్లు రావడం తమకు శుభపరిణామమని, ఐదేళ్లగా రాష్ట్రంలో అస్తవ్యస్త పాలనతో విసిగిపోయిన ప్రజలు కూటమివైపు మొగ్గు చూపారని తెలుస్తోందన్నారు.

ప్రజాస్వామ్యాన్ని తిరిగి రక్షించుకోవాలనే దృక్పథంతో ఉదయం నుంచి భారీ సంఖ్యలో ఓటర్లు పోలింగ్ కేంద్రాలకు తరలి రావడం ఎంతో ఆనందంగా ఉందని అన్నారు.

బాదంలో అధిక పోషకాలు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : రోజూ తీసుకునే ఆహారంలో అధిక పోషకాలు కలిగిన గింజలను భాగం చేసుకోవాలని, మరి ముఖ్యంగా బాదంను తీసుకుంటే మంచిదని మాక్స్ హెల్త్‌కేర్ రీజినల్ హెడ్ ఆఫ్ డైటెటిక్స్ రితికా సమద్దర్ సూచించారు. మదర్స్ డే సందర్భంగా నగరంలో జరిగిన ఓ అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతూ సంరక్షకులుగా తల్లులు ఎల్లప్పుడూ వారి ఆరోగ్యాన్ని చూసుకోవాల్సి ఉంటుందని, ఈ నేపథ్యంలో సరైన పోషకాలు కలిగిన బాదం వంటివి ప్రతిరోజూ తీసుకోవాలని కోరారు. బాదంపప్పులో ప్రోటీన్, జింక్, మెగ్నీషియం, ఐరన్, కాల్షియం, ఫాస్ఫరస్ విటమిన్ ఇ ఉన్నాయని తెలిపారు.

వైసిపి నేతలతో వాసుపల్లి సమావేశం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ప్రజలు జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వాన్ని మళ్లీ రావాలని కోరుకుంటున్నారని ఎన్నికల పోలింగ్ సరళి రుజువు చేస్తోందని దక్షిణ వైసిపి అభ్యర్థి, ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ అన్నారు. మంగళవారం ఆశీలుమెట్టలోని తన కార్యాలయంలో సార్వత్రిక ఎన్నికల ఓటింగ్ ప్రక్రియ ముగింపు సందర్భంగా నియోజకవర్గంలోని వైసిపి శ్రేణులతో ఆయన సమావేశం నిర్వహించారు. వార్డుల్లో వైసిపికి వచ్చిన ఓటింగ్ ఎంతవరకు ఉంటుంది ? ఎంత మెజారిటీ సాధిస్తామని ముందు అడిగి తెలుసుకున్నారు. 47 రోజుల ఎన్నికల ప్రచారంలో కష్టపడిన ప్రతి కార్యకర్తకు, నాయకులకు ధన్యవాదాలు తెలిపారు. కష్టపడి వైసిపికి ఓటింగ్ శాతం పెంచారని, ప్రజలు కూడా జగనన్న ప్రభుత్వం మళ్ళీ రావాలని కోరుకుంటున్నట్టు అర్థమవుతోందని తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు తోట పద్మావతి, కోడిగుడ్ల పూర్ణిమ శ్రీధర్ పాల్గొన్నారు.

కింగ్స్ కార్నర్ స్టోన్ కాలేజీతో ఆర్ఎంటి భాగస్వామ్యం

ఎంవిపి.కాలనీ : కింగ్స్ కార్నర్ స్టోన్ ఇంటర్నేషనల్ కాలేజీతో ఆర్ఎంటి వర్సిటీ భాగస్వామ్యమైంది. ఈ సందర్భంగా ఆ విద్యా సంస్థల ప్రతినిధులు ప్రొఫెసర్ అభిజిత్ మణి, నికోల్ ఆర్సెన్, ప్రొఫెసర్ రాజారామన్ ఏరి ఆ వివరాలను ఎంవిపి.కాలనీలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వెల్లడించారు.

'ఉపాధి హామీ' నిర్వీర్యం?



ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీలు (ఫైల్)

- అక్కరకురాని రోజు వారీ వేతనం
- తాగునీరు, పనిముట్లుకు ప్రత్యేక కేటాయింపులు లేవు
- టెంట్ల స్థానంలో తాటి కమ్మలతో పందిళ్లు

ప్రజాశక్తి -భీమునిపట్నం : వలసల నివారణ, కూలీలకు పని కల్పనకు చట్ట బద్దంగా అమలు చేస్తున్న మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ చట్టం ప్రస్తుత కేంద్ర ప్రభుత్వ విధానాల వల్ల నిర్వీర్యం అవుతుందనే చెప్పాలి. ఒక్కో జాబ్ కార్డుకు ఏడాదికి వంద రోజుల పని కల్పన, గిట్టుబాటు అయ్యేలా కూలి, పని ప్రదేశంలో సౌకర్యాల కల్పన, ఇతర చట్ట బద్ధమైన నిబంధనలు ఆచరణలో అమలు జరగడం లేదన్న విమర్శలు ఉన్నాయి.

8 వేల మందికి గాను 2 వేల మందికి పని కల్పన

మండలంలో 6,343 జాబ్ కార్డులుండగా, ఇందులో 8,861 మంది కూలీలు తమ పేర్లు నమోదు చేసుకుని ఉన్నారు. 2,300 మందికి ప్రస్తుతం పని కల్పిస్తున్నారు. ఒక కుటుంబానికి ఏడాదికి వంద రోజులు పని కల్పిస్తున్నట్టుగా సంబంధిత అధికారులు చెబుతుండగా వాస్తవంగా ఆ పరిస్థితి కనబడడం లేదని ఇట్టే స్పష్టం అవుతోంది. 2023 ఏప్రిల్ నుంచి 2024 మార్చి వరకు రెండు లక్షలా 60 వేలు పని దినాలు కల్పన లక్ష్యం కాగా, రెండు లక్షల 31వేలా 80 పని దినాలు కల్పించారు. మెటీరియల్, వేతనాలు కలిపి రూ.7 కోట్లా 51 లక్షలు ఖర్చు చేశారు. 4,530 మందికి పని కల్పించారు. 102 పనులు చేపట్టారు.

అందని నిర్దేశించిన వేతనం...

రోజు వారీ వేతనం రూ.300 కల్పించాల్సి ఉంది. అయితే నేల స్వభావం, మట్టి గట్టిగా ఉండడం లాంటి కారణాల వల్ల కొన్ని గ్రామాల్లో రూ.210 నుంచి రూ.280 కూలి లభిస్తుంది. ఉదాహరణకు సింగనబంద చెరువు పని చేసే కూలీలకు ఒక్కొక్కరికి రోజుకు రూ.150 వస్తోంది. తాళ్లవలస, రేఖవానిపాలెం పశువుల కోనేరు పనులు చేస్తున్న కూలీలకు ఒక్కొక్కరికి రోజు వారీ వేతనం రూ.280 వస్తోంది.

టెంట్ల స్థానంలో పందిళ్లు..

దాదాపు ఏడాదిన్నర క్రితం పని ప్రదేశాల్లో కూలీలు విశ్రాంతి తీసుకునేందుకు ఎన్ఆర్ఇజిఎస్ అధికారులు టెంట్లు (షామియానాలు) ఏర్పాటు చేసేవారు. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. కమ్మలతో పందిళ్లు ఏర్పాటుచేశారు. దీంతో పలువురు కూలీలు పెదవి విరుస్తున్నారు. అరకొరగా ఏర్పాటుచేసిన కమ్మల పందిళ్లు పూర్తి స్థాయిలో నీడను ఇవ్వడం లేదని పలువురు కూలీలు వాపోతున్నారు.

కనీస సదుపాయాలు కరువు..

పని ప్రదేశంలో తాగునీరు, ప్రథమ చికిత్సకు అవసరమయ్యే అయోడిన్, కాటన్ తదితరాలు అందుబాటులో లేవని పలువురు కూలీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పనికి వెళ్లేటప్పుడు తమతోనే క్యాన్లు ద్వారా తాగునీరు తీసుకు వెళ్తున్నట్లు వివరించారు. ఏడాదిన్నర క్రితం వరకు తాగు నీటి సదుపాయం ప్రభుత్వమే కల్పించేది. కాలక్రమేణా ఆ బాధ్యత నుంచి ప్రభుత్వం వైదొలగింది. కూలీలు వెంట తెచ్చుకున్న తాగు నీటికి 5 లీటర్లకు రూ.10 కూలీల రోజు వారీ వేతనంలో కలిపి ఇచ్చేది ప్రభుత్వం. ప్రస్తుతం ఆ పరిస్థితి లేదు. అంతే కాదు గునపం, పలుగు, తట్టకు రూ.10 చొప్పున కూలీల రోజు వారీ వేతనంలో కలిపి ప్రభుత్వం ఇచ్చేది. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. ప్రస్తుత కేంద్ర ప్రభుత్వం ఉద్దేశ పూర్వకంగానే ఉపాధి హామీ పథకాన్ని నీరు గార్చే ప్రయత్నం చేస్తున్నట్లు ఇట్టే స్పష్టమవుతోంది. బడ్జెట్‌లో కూడా కేటాయింపులు తగ్గించేసింది కేంద్ర ప్రభుత్వం. అమనాం బారవాని చెరువు, మూలకుద్దు, పెదనాగమయ్యపాలెం పశు వుల కోనేరు పనులు చేస్తున్న కూలీలకు ఒక్కొక్కరికి రూ సగటున రూ.200 వేతనం అందుతుంది.

జాబ్ కార్డు ఉన్న అందరికీ పని

జాబ్ కార్డు ఉన్న వారందరికీ పని కల్పిస్తున్నాం. నిర్ణీత గడువులోగానే కూలీలకు వేతనం ఇస్తున్నాం. ఎండలు తీవ్రంగా ఉండడంతో కొన్ని గ్రామాల్లో ఉదయం 5 నుంచి 10 గంటల వరకు, మరికొన్ని గ్రామాల్లో ఉదయం 7.30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పని చేస్తున్నారు. ఇంకొన్ని గ్రామాల్లో సాయంత్రం 4 నుంచి 6 గంటల వరకు పని చేస్తున్నారు. ఎపిఒ, ఇద్దరు టెక్నికల్ అసిస్టెంట్లు, 15 మంది ఫీల్డ్ అసిస్టెంట్లు, దాదాపు 70 మంది మేట్ లు ఉన్నారు.



జివిఎస్.వెంకట గౌరి
అడిషనల్ ప్రోగ్రాం అధికారి
ఎన్ఆర్ఇజిఎస్ భీమునిపట్నం

కూలి గిట్టు బాటు లేదు

చెరువు పనులు అలవాటే. ఉదయం 5 గంటలకు చెరువుకు చేరుకుని పనిలో దిగుతాం. మళ్లీ 10 గంటలకు పని ముగించుకుని ఇంటికి వెళ్తాం. ఇక్కడ మట్టి గట్టిగా ఉండడం వల్ల కూలి గిట్టుబాటు కావడం లేదు. రోజుకు రూ 100 నుంచి రూ.120 చొప్పున కూలి లభిస్తోంది.



ఎల్.కొండమ్మ
ఉపాధి కూలి
బోడమెట్టపాలెం.

రోజూ కూలి ఉంటుంది

చెరువు పనులు లేనప్పుడు రోజూ కూలి పని కోసం ఎదురు చూసే వాళ్లం. ఉపాధి హామీ పథకం అమలులోకి వచ్చాక పని కోసం ఎదురు చూడనవసరం లేదు. రోజు కూలి రూ.150 వరకు గిట్టుబాటు అవుతుంది.



ఎన్.రామసూరమ్మ
ఉపాధి కూలి
అమనాం

జూ పార్కులో చిన్నారులకు వేసవి శిబిరాలు

ప్రజాశక్తి - ఆరిలోవ : ఇందిరాగాంధీ జంతు ప్రదర్శనశాలలో ఈ నెల 21 నుంచి జూన్ 1 వరకు విద్యార్థులకు రెండు విభాగాలుగా వేసవి శిబిరాలు నిర్వహించనున్నట్టు జూ క్యూరేటర్ డాక్టర్ నందనీ సలారియా మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమ్మర్ క్యాంప్‌లో భాగంగా చిన్నారులకు సరికొత్త అనుభూతి అందించేందుకు వివిధ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. 5 నుంచి 11 ఏళ్ల వయస్సు గల పిల్లలకు ఈ నెల 21 నుంచి 25వ తేదీ వరకు, 12 నుంచి 18 ఏళ్ల వయస్సు వారికి ఈ నెల 28 నుంచి జూన్ 1వ తేదీ వరకు రెండు బ్యాచ్‌లుగా విభజించి సమ్మర్ క్యాంప్ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ వేసవి శిబిరంలో విద్యార్థులు అరుదైన పక్షి జాతుల గురించి తెలుసుకోవడం, వన్య ప్రాణుల సంరక్షణ, బర్డ్ వాచింగ్, గైడెడ్ జూ టూర్, వన్యప్రాణులకు అందించే చికిత్స గురించి తెలుసుకునేందుకు జూ వెటర్నరీ హాస్పిటల్ విజిట్ తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు తెలిపారు. ఆసక్తి గల వారు రూ.500 చెల్లించి తమ పేర్లను నమోదు చేసుకోవాలని కోరారు. పేర్లు నమోదు చేసుకున్న ప్రతి ఒక్కరికీ స్పెషల్ రిజిస్ట్రేషన్ కిట్ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఆసక్తి గలవారు 94408 10213 నెంబరుకు ఫోన్ చేసి పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు.



చలివేంద్రాన్ని ప్రారంభించిన యువజన సేవా సంఘం సభ్యులు

మజ్జిగ చలివేంద్రాలు ఏర్పాటు

ప్రజాశక్తి - యంత్రాంగం

ఆరిలోవ : 12వ వార్డు పెదగదిలి శ్రీకృష్ణ యువజన సేవా సంఘం ఆధ్వర్యాన స్థానికుడు కడుపుకోట్ల అప్పారావు ప్రథమ వర్ధంతిని పురస్కరించుకొని మంగళవారం చలివేంద్రాన్ని ప్రారంభించారు. అనంతరం పాదచారులకు, ప్రయాణికులకు మజ్జిగ పంపిణీ చేశారు. వేసవిని దృష్టిలో పెట్టుకొని చలివేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమని సంఘం సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం పెద్దలు, స్థానికులు పాల్గొన్నారు.

సీతమ్మధార : అక్కయ్యపాలెంలో ఎబిటియుసి ఆధ్వర్యాన చలివేంద్రాన్ని ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా 26వ వార్డు టిడిపి అధ్యక్షులు ముక్కా కిషోర్‌కుమార్ మాట్లాడుతూ, వేసవికాలంలో చలివేంద్రాలు ఏర్పాటు చేయాల్సిన అవసరం ప్రతి ఒక్కరిపైని ఉందన్నారు. ఎండలు ఎక్కువగా ఉండడంతో ఈ చలివేంద్రాలు ప్రయాణికులకు దోహదపడతాయని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో ఎబిటియుసి నాయకులు వామనమూర్తి తదితరులు పాల్గొన్నారు.



మజ్జిగ పంపిణీ చేస్తున్న కిషోర్‌కుమార్

విజ్ఞాన విహార్ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి -ఆనందపురం : 10వ తరగతి సిబిఎస్ఇ పరీక్షల్లో గుడిలోవ విజ్ఞాన విహార విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచినట్లు పాఠశాల యాజమాన్య ప్రతినిధులు తెలిపారు. పాఠశాల నుంచి 10వ తరగతి సిబిఎస్ఇ పరీక్షలకు 78 మంది విద్యార్థులు హాజరుకాగా అందరూ ఉత్తీర్ణత సాధించారని పేర్కొన్నారు. జి.కిరణ్మయి, ఎన్.ఈశ్వర్, చంద్రహాస్ మంచి మార్కులు సాధించారని తెలిపారు. విద్యార్థులను విజ్ఞాన విహార యాజమాన్య ప్రతినిధులు, సిబ్బంది అభినందనలు తెలియజేశారు.

అందరి సహకారంతో ప్రశాంతంగా పోలింగ్

ప్రజాశక్తి జి-మాడుగుల : ప్రజ సహకారంతో సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించడంలో పోలీసులు కీలకపాత్ర వహించారని స్థానిక సిఐ రమేష్ అన్నారు. మంగళవారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, అల్లూరి జిల్లా ఎస్‌పి తుహిన్ సిన్హా, ఎఎస్‌పి ధీరజ్ ఆదేశాల మేరకు నెలరోజుల ముందు నుంచే గిరిజన గ్రామాల్లో సందర్శిస్తూ, పటిష్ట భద్రత, నిఘా చర్యలు చేపట్టడంతోపాటు ఓటింగ్‌పై ప్రజలకు భరోసా, అవగాహన కల్పించడంతో పోలీసులు కృతకృత్యులయ్యారన్నారు. దీంతో మారుమూల కొండప్రాంతాల నుంచి గిరిజనులు ఓటింగ్‌కు తరలివచ్చారని, మావోయిస్టు ప్రభావిత ప్రాంతాలైనప్పటికీ, ఆయా మండలాల్లో నమోదైన పోలింగ్‌శాతమే ఇందుకు నిదర్శనమన్నారు., జి.మాడుగుల మండలంలో 47.33శాతం, పెదబయలు 66.03,శాతం, ముంచింగిపుట్టులో 70.64, శాతం పోలింగ్ నమోదైనట్టు ఆయన తెలిపారు.

అధ్వాన స్థితిలో హాస్టల్ రోడ్డు

మట్టి పోశారు.. కాలువలు మరిచారు...
8 నెలలుగా కాలయాపన

ప్రజాశక్తి- ఆనందపురం : శ్రమజీవుల కాలనీ బాలికల వసతి గృహం రోడ్డు చాలా అధ్వానంగా తయారైంది. అధికారులు రోడ్డు నిర్మిస్తామని చెప్పి 8 నెలల క్రితం సుమారు రూ.8 లక్షలు కేటాయించి గ్రావెల్ పోసి పనులను వదిలేశారు. రోడ్డుకు ఇరువైపులా ఉన్న కాలనీవాసులు వాడుక నీరు పోవడానికి కాలువ లేకపోవడంతో రోడ్డుపైనే మురుగు కూపంగా తయారవుతోంది. రోడ్డు వేయడానికి ముందే వర్షపు నీరు మురుగునీరు పోవడానికి డ్రైనేజీ వ్యవస్థను నిర్మించకపోవడంతో రోడ్డు అధ్వానంగా తయారైంది. ఈ విషయమై అనేకసార్లు అధికారులను కలిసినప్పటికీ పనులు ముందుకు సాగడంలేదని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండల కేంద్రానికి కూతవేటు దూరంలో ఉన్న రోడ్డు పరిస్థితి ఇలా ఉంటే దూర ప్రాంతాల్లో ఉన్న రోడ్లను ఏమి బాగు చేస్తారని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ఈ రోడ్డు గుండా వసతి గృహానికి బాలికలు రాకపోకలు సాగిస్తుంటారు. ఇప్పటికైనా మండల అధికారులు స్పందించి రోడ్డును నిర్మించాలని శ్రమజీవుల కాలనీ వాసులు, హాస్టల్ విద్యార్థులు విజ్ఞప్తి చేస్తున్నారు.



రోడ్డుపై పారుతున్న మురుగు నీరు



దర్శన్ (8వ ర్యాంక్) గీతిక (12వ ర్యాంక్) చరణ్ (14వ ర్యాంక్)

ఎపిఆర్‌జెసి ఫలితాల్లో శశి విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి -తగరపువలస : ఎపిఆర్‌జెసి పరీక్షా ఫలితాల్లో తమ విద్యార్థులు ప్రతిభ కనబరిచినట్లు స్థానిక సంగివలస శశి విద్యా సంస్థల వైస్ చైర్మన్ మేకా నరేంద్రకృష్ణ, అకడమిక్ డైరెక్టర్ మేకా క్రాంతి సుధ ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం విడుదలైన ఫలితాల్లో విద్యార్థులు ఆర్.దర్శన్ స్టేట్ 8వ ర్యాంకు, కె గీతిక 12, జి.చరణ్ 14, కె.నిహారిక 20, వి.భరత్‌గోపాలస్వామి 29, ఎస్.ఐశ్వర్య 31, ఆర్.దిలీప్ కుమార్ 32, డి.వర్షిణి 33, కె.ధనుష్‌నాయుడు 35, సిహెచ్ యోగామృత 36, సిహెచ్.కశ్యప్ 40, కె.యామిని 45, బి.సందీప్ 49వ ర్యాంకులతో ప్రతిభ కనబరిచారని తెలిపారు. వీరందరినీ వారు అభినందించారు

పద్మనాభంలో 87 శాతం పోలింగ్

ప్రజాశక్తి -యంత్రాంగం

పద్మనాభం : పద్మనాభం మండలంలోని 22 గ్రామపంచాయతీల పరిధిలో 45 పోలింగ్ బూత్‌ల్లో సోమవారం జరిగిన శాసనసభ ఎన్నికలలో 42145 మంది ఓటర్లకు గానూ 36666 మంది ఓటును వినియోగించుకున్నారు. 87 శాతం పోలింగ్ నమోదైంది. మహిళా ఓటర్లు అధిక శాతం ఓటును వినియోగించుకున్నారు. మునుపెన్నడూ లేనంత విధంగా ఈ సారి ఎన్నికల్లో అత్యధిక శాతం ఓట్లు పోలింగ్ కావడంతో తీవ్ర చర్చ నడుస్తోంది. జగన్ పథకాలకు మహిళలు ఆకర్షితులయ్యారా? లేకుంటే చంద్రబాబు సూపర్ సిక్స్ పథకాలకు ఆకర్షితులయ్యారా? అనే చర్చ జోరుగా సాగుతోంది. పోలింగ్ బూత్‌ల వద్ద ఉదయం ఆరు గంటలకే అధిక సంఖ్యలో మహిళా ఓటర్లు క్యూ లైన్‌లో నిలబడి ఓటు హక్కును వినియోగించుకున్నారు.

పెందుర్తిలో 67.66 శాతం ఓటింగ్

పెందుర్తి : నియోజకవర్గంలో సోమవారం జరిగిన ఎన్నికల్లో మూడు మండలాలు, ఆరు వార్డుల్లో కలిపి 299 బూత్‌లున్నాయి. మొత్తం 307545 మంది ఓటర్లు ఉన్నారు. పురుష ఓటర్లు 152592, మహిళా ఓటర్లు 154948, ట్రాన్స్‌జెండర్ 5గా ఉన్నాయి. మొత్తం 208099 ఓట్లు పోలయ్యాయి. పురుష ఓటర్లు 101454, మహిళా ఓటర్లు 106641, ట్రాన్స్ జెండర్ నాలుగు ఓట్లు పోలయ్యాయి. మొత్తం 67.66 ఓటింగ్ శాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు. గతంతో పోలిస్తే ఈసారి కొంచెం తక్కువ ఓటింగ్ నమోదైంది.

పలు రైళ్లు రద్దు

ప్రజాశక్తి-విశాఖపట్నం : దక్షిణ మధ్య రైల్వేలోని విజయవాడ డివిజన్‌లో భద్రతా పనుల కారణంగా పలు రైళ్లు రద్దు చేస్తున్నట్లు ఆ శాఖ అధికారులు మంగళవారం రాత్రి ప్రకటించారు.

రైలు నెంబర్ 17239 గుంటూరు-విశాఖపట్నం సింహాద్రి ఎక్స్‌ప్రెస్ ఈ నెల 15 నుంచి 26వ తేదీ వరకు రద్దు చేశారు. రైలు నెంబర్ 17240 విశాఖపట్నం-గుంటూరు సింహాద్రి ఎక్స్‌ప్రెస్ ఈ నెల 16 నుంచి 27వ తేదీ వరకు రద్దుచేశారు.

రైలు నెంబర్ 22701 విశాఖపట్నం-గుంటూరు ఉదయ్ ఎక్స్‌ప్రెస్ ఈ నెల 15 నుంచి 26వ తేదీ వరకు నడిచే రోజులలో విశాఖపట్నం నుంచి బయలుదేరుతుంది. రైలు నెంబర్ 22702 గుంటూరు-విశాఖపట్నం ఉదయ్ ఎక్స్‌ప్రెస్ ఈ నెల 15 నుంచి 26వ తేదీ వరకు నడిచే రోజులలో విజయవాడ నుంచి బయలుదేరుతుంది.

రైలు నెంబర్ 07466 రాజమండ్రి-విశాఖపట్నం, 07467 విశాఖపట్నం-రాజమండ్రి రైళ్లు ఈ నెల 15 నుంచి 26వ తేదీ వరకు చేశారు. ప్రయాణికులు ఈ మార్పులకనుగుణంగా వ్యవహరించాలని రైల్వే శాఖ అధికారులు అభ్యర్థించారు.

19, 20, 21 తేదీల్లో రక్తదాన శిబిరం

ప్రజాశక్తి -పాడేరు : గిరిజనులలో రక్తహీనత సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకొంటున్నామని, అందులో భాగంగా మోదకొండమ్మ పండుగ సమయంలో ఈనెల 19, 20, 21 తేదీలలో రక్తదాన శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు సబ్ కలెక్టర్ ధాత్రి రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పాడేరు సబ్ కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించే రక్తదానశిబిరంలో యువత, ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్తదానం చేయాలని పిలుపునిచ్చారు. ఏజెన్సీలో రక్తం కొరతతో సికెల్‌సెల్ ఎనీమియాతోపాటు అనేక అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న వారికి అండగా ఉండాలని, అలాగే ఏజెన్సీలో రక్తం కొరతతో అత్యవసర వైద్యసేవలకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని వారికి అండగా ఉండేందుకు ఈ రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నామన్నారు.

నిర్వాసిత కాలనీల్లో...

అడుగంటిన భూగర్భ జలాలు



ప్రజాశక్తి -గాజువాక : పెదగంట్యాడ మండల పరిధిలో 14 నిర్వాసిత గ్రామాలు ఉన్నాయి. వీటిలో కొన్ని నిర్వాసిత గ్రామాల్లో భూగర్భ జలాలు అడుగంటడంతో పది రోజులుగా బోర్ల నుంచి నీరు రాక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. 50 వేలు జనాభా ఉన్న ఈ కాలనీలో 20 వేల మంది పది రోజులుగా నీటి సమస్యతో ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా పెద్దకోరాడ, వెంపలినగర్, దళ్లివానిపాలెం, సిద్దేశ్వరం, నెల్లిముక్కు, బాలచెరువు ప్రాంతాల్లో ప్రస్తుతం భూగర్భ జలాలు ఇంకిపోయాయని స్థానికులు వాపోతున్నారు. సమతానగర్ తదితర ప్రాంతాల్లో భారీగా అపార్ట్‌మెంట్ల నిర్మాణమే ఈ సమస్యకు కారణంగా భావిస్తున్నారు. అపార్ట్‌మెంట్ల వద్ద 200 నుంచి 300 మీటర్ల లోతు వరకు బోర్లు తవ్వడం వల్ల, నిర్వాసిత గ్రామాల్లో బోర్లకు నీరు అందడంలేదని వారు చెబుతున్నారు. గంటసేపు మోటార్ వేస్తే ట్యాంక్ నిండేదని, ఇప్పుడు గంటసేపు మోటార్ వేస్తే ఐదు బకెట్ల నీరు కూడా రావడంలేదని స్థానికులు తెలిపారు.

ప్రారంభమైన మంచినీటి ఇబ్బందులు

నీరు రావడం లేదని స్థానికులు బోరు మెకానిక్‌లను తీసుకొచ్చి చూపిస్తుంటే మరలా బోర్లు లోతుగా తవ్వించాలని చెబుతున్నారని, ఇప్పుడు ఆ పనిచేయాలంటే ప్రతి ఇంటికీ రూ.50 వేలు నుంచి రూ.లక్ష వరకు అదనపు ఖర్చు అవుతుందని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. గత ఏడాది వర్షాలు లేని కారణంగా భూగర్భ జలాలు తగ్గాయని ఇంజినీర్లు అంచనా వేస్తున్నారు. ఈ ఏడాది కూడా పూర్తిస్థాయిలో వర్షం పడకపోతే కాలనీల్లో నీటి సమస్య మరింత తీవ్రం కావచ్చని ఆందోళన చెందుతున్నారు.

రోజు విడిచి రోజు నీటి సరఫరా

నిర్వాసిత కాలనీలకు జివిఎంసి రోజు విడిచి రోజు తాగునీరు సరఫరా చేస్తోంది. అది కూడా అరగంట మాత్రమే సరఫరా చేయడంతో ఒక ఇంటికి మాత్రమే సరిపోతుంది. అద్దెకు ఉన్నవారికి నీరు సరిపోవడంలేదు. వారంతా బోర్లపైనే ఆధారపడక తప్పడంలేదు. బోర్లలో నీరు రాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

సెలెస్ట్ నిర్మాణంతో పలు కాలనీలకు ఇబ్బందులు

లంక గ్రౌండ్‌కు అనుకొని భారీగా సెలెస్ట్ అపార్ట్‌మెంట్‌ను నిర్మించారు. దీని నిర్మాణం తర్వాత చైతన్యనగర్, చినగంట్యాడ, ఎర్రగడ్డ కాలనీ, ఎల్‌బి.నగర్ ప్రాంతాల్లో భూగర్భ జలాలు అడుగంటిపోయాయి. దీంతో వీరు మరలా బోర్లు తవ్వుతున్నారు.



సదస్సులో మాట్లాడుతున్న విశాఖ జిల్లా న్యాయాధికార సంస్థ అధ్యక్షులు ఆలపాటి గిరిధర్

మధ్యవర్తిత్వచట్టాన్ని వినియోగించుకోవాలి

ప్రజాశక్తి-విశాఖపట్నం : మధ్యవర్తిత్వ చట్టాన్ని న్యాయవాదులు వినియోగించుకోవాలని విశాఖ జిల్లా న్యాయాధికార సంస్థ అధ్యక్షులు ఆలపాటి గిరిధర్ సూచించారు. విశాఖ జిల్లా న్యాయాధికార సంస్థ ఆధ్వర్యాన మధ్యవర్తిత్వం అంశంపై మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మధ్యవర్తిత్వం వల్ల కలిగే లాభాలను వివరించారు. మధ్యవర్తిత్వ ప్రక్రియ ద్వారా త్వరితంగా, ఎటువంటి ఖర్చులేకుండా కేసులను పరిష్కరించుకోవచ్చని తెలిపారు. సమయం వృథాకాదన్నారు. కేసులు పరిష్కారమవుతాయని చెప్పారు. పున:సమీక్షకు, అప్పీలుకు అస్కారం ఉండదని వివరించారు. హిట్ అండ్ రన్ కేసుల్లో నష్టపరిహారం, జాతీయ లోక్ అదాలత్ తదితర అంశాలను వివరించారు. ఈ కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి ఎం.వెంకటశేషమ్మ, మొదటి అదనపు జిల్లా న్యాయమూర్తి ఎం.వెంకటరమణ, కుటుంబ న్యాయస్థాన న్యాయమూర్తి కె.రాధారత్నం, జిల్లా న్యాయవాదుల సంఘం సభ్యులు బెవరా సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కూడళ్లు దాటాలంటే..



జాతీయ రహదారిలో తరచూ ప్రమాదాలు

ఆందోళనలో ప్రయాణికులు

ప్రజాశక్తి -మధురవాడ : జాతీయ రహదారిని అనుకుని ఉన్నకూడళ్లు దాటాలంటే వాహనదారులు, పాదచారులు భయాందోళన చెందుతున్నారు. ఎండాడ పెట్రోల్ బంకు, జూపార్కు కూడళ్ల మలుపు ప్రాంతాలు కావడం, రోజురోజుకూ రద్దీ అధికమవుతుండటంతో ప్రమాదాలు సంఖ్య పెరుగుతోంది. ముఖ్యంగా ఎండాడ పెట్రోల్ బంకు, కంబాలకొండ, వివేకాంద్‌నగర్, సాగర్ నగర్, దసపల్లా లే-అవుట్ తదితర కూడళ్ల వద్ద మౌలిక వసతులు లేకపోవడంతో జాతీయ రహదారిపై వేగంగా వచ్చే భారీ వాహనాలు ఢీకొడుతున్నాయి. ఇటీవల కాలంలో ఆయా ప్రాంతాల్లో తరుచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఆయా ప్రమాదాల్లో ఒకరిద్దరు మృతి చెందిన ఘటనలూ ఉన్నాయి. పలువురు తీవ్ర గాయాలతో బయటపడ్డారు. విద్యుత్ దీపాలు అంతంత మాత్రంగా వెలగడంతో దారంతా చీకటిమయంగా ఉంటోంది. ఢీకొట్టిన వాహనాలు గుర్తింపు కూడా సాధ్యపడటం లేదని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు చర్యలు తీసుకొని స్టాపర్స్‌తో పాటు వేగ నియంత్రణ తగ్గించేలా ఏర్పాట్లు చేయాలని పలువురు ప్రయాణికులు కోరుతున్నారు.

అంబులెన్స్‌లో గర్భిణి ప్రసవం

ప్రజాశక్తి -డుంబ్రిగుడ

మండలంలోని గసభ పంచాయతీ మొగిరిగుడ గ్రామానికి చెందిన పాంగి సుమిత్ర అనే గర్భిణి 108 వాహనంలో పండంటిబిడ్డకు జన్మనిచ్చింది. మంగళవారం తెల్లవారు జామున సుమిత్రకు పురిటినొప్పులు రాగా, ఇంటి వద్ద డెలివరీ కష్టం కావడంతో. కుటుంబీకులు 108కు సమాచారం అందించారు. వెంటనే వచ్చిన అంబులెన్స్‌లో సుమిత్రను ఆసుపత్రికి తరలించే క్రమంలో మార్గ మధ్యలో పురిటి నొప్పులు అధికం కావడంతో ఇఎంటి జయంత్‌కుమార్ వైద్యం అందించారు. శిశువు అడ్డంగా ఉండడంతో డెలివరీ కష్టతరమైన పరిస్థితిల్లో గర్భిణికి పరిస్థితిని వివరించి ఆమె సహకరించడంతో అంబులెన్స్ వాహనంలోనే సుఖప్రసవం చేయించారు. తల్లిబిడ్డ క్షేమంగా ఉండడంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు. అయినప్పటికీ తదుపరి పరీక్షలు, మెరుగైన వైద్యం కోసం బాలింత, నవజాత శిశువును ఆసుపత్రికి తరలించామని పైలెట్ శ్యాం తెలిపారు.సకాలంలో గ్రామానికి చేరుకోవడమే కాకుండా, కష్టసమయంలో అండగా నిలిచి,సుఖప్రసవం చేయించిన 108 వాహనసిబ్బందిని గర్భిణి కుటుంబీకులు అభినందించి, ధన్యవాదాలు తెలిపారు.



అంబులెన్స్‌లో ప్రసవించిన సుమిత్ర

అకాల వర్షాలతో ఉప్పు పంటకు ముప్పు

నష్టపోనున్న రైతులు

ప్రజాశక్తి-అచ్యుతాపురం

అకాల వర్షాలతో ఉప్పు పంటకు ముప్పు ఏర్పడింది. మండుటెండల వల్ల ఉప్పు అధిక మొత్తంలో ఉత్పత్తి అవుతుందని భావించిన ఉప్పు రైతులను అకాల వర్షాలు దెబ్బతీస్తున్నాయి. మండలంలో పూడిమడకలో శ్రీశ్రీనివాస సాల్ట్ పాన్ వర్కర్స్ ఆధ్వర్యంలో 25 ఎకరాల విస్తీర్ణంలో 50 మంది రైతులు ప్రతి సంవత్సరం ఉప్పు పంట పండించి దానిపై వచ్చే ఆదాయంతో కుటుంబాలను పోషించుకుంటున్నారు. నాగుల చవితి తర్వాత నుంచి ఉప్పుమడులు పనులు చేపడతారు. ఉప్పు తయారీకి ముందుగా గట్లు వేయడం, నేల చదును చేయడం తదితర పనులు చేయాల్సి ఉంటుంది. ఉప్పు పండించడానికి సముద్రతీరంలో ఉన్న ఇసుకతో పనులు చేపడుతారు. ప్రభుత్వ ఆంక్షలు కారణంగా తీరం వద్దనున్న ఇసుకను తీసుకోవడానికి అధికారులు ఆటంకం కల్పిస్తున్నారు. ప్రస్తుత రోజులలో టన్ను ఇసుక వేలాది రూపాయలు పెట్టి కొనుగోలు చేసే ఆర్థిక స్తోమత లేక మట్టి పైనే పంట పండించడం ప్రారంభిస్తున్నారు. వారి కష్టార్జితంతో నేలను చదును చేసి, గట్లు పరిపుష్టతగా వేయడం వంటి పనులు చేశారు. సంక్రాంతి వరకు వాతావరణం అతి శీతలంగా మంచు కారణంగా ఆశించిన రీతిలో ఉప్పు పంట చేతికి రావడం లేదని ఉప్పు రైతులు చెబుతున్నారు. ఫిబ్రవరి నెల నుంచి ఉప్పు పంట రావడం ప్రారంభమవుతుంది. ఫిబ్రవరి, మార్చి, ఏప్రిల్, మే నెలలో ఎంత గట్టిగా ఎండలు కాస్తే అంత లాభసాటిగా ఉంటుందని రైతులు తెలిపారు. అయితే ఇటీవల కురిసిన అకాల వర్షాలకు ఉప్పుమడులు బురదమయంగా మారాయి. గట్లు శిథిలావస్థకు చేరుతున్నాయి. దాని కారణంగా ఉప్పు పంట పండడానికి ఆటంకం ఏర్పడింది.

పండించిన ఉప్పు గట్లపై నుంచి ప్లాట్‌ఫారంకు మోసి కుప్పలుగా వేస్తున్నారు. వర్షానికి కరిగిపోకుండా వాటిపై తార్ఫలిన్లు వేసి రక్షణ కల్పిస్తున్నారు. పెరిగిన డీజిల్ ధరలతో ఉప్పు టేరులో బడులలోకి ఇంజిన్ ద్వారా తరలించడానికి అధిక మొత్తంలో ఖర్చవుతుందని రైతులు చెబుతున్నారు. ఖర్చులన్నీ పోయి చేతికి వచ్చిన డబ్బులతో సంవత్సరం కాలం జీవించాలని రైతులు తెలిపారు. ప్రభుత్వం స్పందించి ఉప్పు రైతులకు ఆర్థిక సహాయం చేయాలని, డీజిల్ పై సబ్సిడీ ఇప్పించాలని కోరుతున్నారు. ఉప్పు మడులకు గట్లు వేయుట, నేల చదురు చేయుట వంటి పనులు ఉపాధి హామీ పథకం కింద చేపట్టి ఉప్పు రైతులను, కూలీలను ఆదుకోవాలని కోరుతున్నారు. పండించిన ఉప్పు భద్రపరచుకోవడానికి షెడ్లు కట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు.



అచ్యుతాపురం మండలం పూడిమడకలో ఉప్పు మడులు



ఉప్పుకు టార్ఫలిన్లు కప్పిన దృశ్యం

కశింకోట మండలంలో 84.60 శాతం పోలింగ్

ప్రజాశక్తి-కశింకోట

కశింకోట మండలంలో మొత్తం ఓట్లు 56,226 కాగా, సోమవారం జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో 47,569 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. 84.60 శాతం పోలింగ్ నమోదైంది. పోలైన ఓట్లు గ్రామాల వారీగా... కశింకోట గ్రామంలో 10,754, తాళ్లపాలెంలో 2,307, కన్నూరుపాలెంలో 628, నరసింగబిల్లిలో 1,152, బయ్యవరంలో 2,222, వెదురుపర్తిలో 1,672, తేగాడలో 1,189, కొత్తపల్లిలో 1,147, బుచ్చయ్యపేటలో 900, జామాదులుపాలెంలో 1,633, పరవాడపాలెంలో 955, విస్సన్నపేటలో 858, ఉగ్గినిపాలెంలో 1,422, భీమవరంలో 882, సుందరయ్యపేట 289, చేరకాములో 769, తీడలో 2,113, ఏఎస్.పేటలో 1,522, సోమవారంలో 1,409, వై.తుని 1,206, ఎన్‌జి.పాలెంలో 1,042, మోసయ్యపేటలో 479, అచ్చర్లలో 1,061, సింగవరంలో 544, గబ్బూరులో 572, చింతలపాలెంలో 1,218, జోగారావుపేటలో 576, పేరంటాలపాలెంలో 505, ఈ చౌడవాడలో 1,411, అడ్డాంలో 573, గోకివానిపాలెంలో 370, బంగారయ్యపేటలో 1,196, అచ్యుతాపురంలో 641 ఓట్లు పోలయ్యాయి.

ఘనంగా చిన్న పైడిమాంబ పండగ

ప్రజాశక్తి- కె.కోటపాడు

మండలంలోని చౌడువాడ గ్రామంలో మంగళవారం చిన్న పైడిమాంబ పండగ గ్రామ ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. ఉదయం నుంచి అమ్మవారి ఆలయానికి భక్తులు అధిక సంఖ్యలో చేరుకొని పూజలు నిర్వహించారు. ఐదేళ్లకు ఒకసారి జరుపుకొనే ఈ పండగను చూడటానికి గ్రామ ప్రజలతో పాటు పరిసర గ్రామ ప్రజలు అధిక సంఖ్యలో వచ్చారు. సోమవారం రాత్రి తొలేరు సంబరం నిర్వహించి మంగళవారం అనుపు కార్యక్రమం నిర్వహించారు. మందు గుండు, డప్పులు వాయిద్యాలు మధ్య పండగను గ్రామ ప్రజలు అత్యంత ఉత్సాహంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి దాడి ఎరుకు నాయుడు, విశాఖ డెయిరీ డైరెక్టర్ గంగాధర్, గోవాడ సుగర్ ఫ్యాక్టరీ మాజీ డైరెక్టర్ రాజ శ్రీనివాసరావు, మాజీ వార్డ్ మెంబర్ పెంటకోట గణేష్, జనసేన పార్టీ నాయకులు కుంచ అంజిబాబు, గ్రామ ప్రజలు పెద్దలు, పాల్గొన్నారు.

ప్రజాస్వామ్య పరిరక్షణకు అందరూ సహకరించారు

యలమంచిలి జనసేన అభ్యర్థి సుందరపు విజయ్ కుమార్

ప్రజాశక్తి-అచ్యుతాపురం

ప్రజాస్వామ్య పరిరక్షణకు ప్రతి ఒక్కరూ సహకరించారని ఎలమంచిలి నియోజకవర్గ జనసేన పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి సుందరపు విజయ్ కుమార్ అన్నారు. అచ్యుతాపురంలో మంగళవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. ఐదు సంవత్సరాల పాటు కష్టపడి పనిచేసి ప్రజల సమస్యలపై పోరాడినందుకు ప్రతిస్పందన ఊహించిన దానికన్నా అత్యధికంగా వస్తుందని చెప్పారు. ప్రతి ఒక్కరూ ముందుకొచ్చి వారి బాధ్యత నిర్వర్తించారన్నారు. ప్రజలు ఆశించినట్లుగా రానున్న ఐదేళ్లలో కొత్త తరహా పాలన అందించడానికి తన సాయి శక్తులా పని చేస్తానన్నారు. ఈ ఎన్నికల్లో తన విజయం తథ్యమని ధీమా వ్యక్తం చేశారు. ఎలమంచిలి నియోజకవర్గంలో 85 శాతానికి పైగా పోలింగ్ జరిగిందన్నారు. పోలింగ్ సందర్భంగా మండుటెండలో నిలబడి ఓట్లు వేసిన వృద్ధులు, వికలాంగులు, మహిళలకు ధన్యవాదాలు తెలిపారు. ఈ సమావేశంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి రాజాన రమేష్ కుమార్, మండల అధ్యక్షుడు జనపరెడ్డి నరసింహారావు, జనసేన పార్టీ మండల అధ్యక్షుడు బయలుపూడి రామదాసు, బిజెపి నియోజవర్గ అధ్యక్షుడు రాజాన సన్యాసినాయుడు, ధూళి రంగనాయకులు, ద్వారపురెడ్డి బాబ్జి తదితరులు పాల్గొన్నారు.



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న జనసేన అభ్యర్థి సుందరపు విజయ్‌కుమార్

స్ట్రాంగ్ రూమ్‌లో ఇవిఎంల భద్రం

ప్రజాశక్తి-అనకాపల్లి

సార్వత్రిక ఎన్నికలు సందర్భంగా అనకాపల్లి జిల్లాలో సోమవారం జరిగిన పోలింగ్‌లో ఉపయోగించిన ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్లను ఎన్నికల అభ్యర్థుల, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో స్ట్రాంగ్ రూమ్‌లో మంగళవారం భద్రపర్చారు. జిల్లాలోని ఉన్న నియోజకవర్గాల నుండి వచ్చిన ఇవిఎంలను కలెక్టర్ రవి పటాన్ శెట్టి, ఎస్పీ కేవీ మురళీకృష్ణ తదితరుల పర్యవేక్షణలో స్ట్రాంగ్ రూంలో భద్రపరిచారు.



కలెక్టర్, ఏజెంట్ల సమక్షంలో స్ట్రాంగ్ రూమ్‌కు సీల్ వేస్తున్న దృశ్యం

బార్ అసోసియేషన్ కార్యవర్గం ప్రమాణ స్వీకారం

ప్రజాశక్తి-అనకాపల్లి

అనకాపల్లి బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గం మంగళవారం ప్రమాణ స్వీకారం చేసింది. బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఎంజెవిఎన్ కుమార్ అధ్యక్షతన ఎన్నికల అధికారి ప్రభాకర్ నేతృత్వంలో ప్రమాణ స్వాకారం జరిగింది. ఇటీవల జరిగిన బార్ ఎన్నికల్లో అధ్యక్షులుగా కుమార్, కార్యదర్శిగా దుర్గారావు, ఉపాధ్యక్షులుగా రోజా, కోశాధికారిగా సందీప్, జాయింట్ సెక్రటరీగా తులసి, స్పోర్ట్స్ సెక్రెటరీగా మోహన్, లైబ్రేరియన్‌గా జగపతి, మహిళా ప్రతినిధిగా కుసుమతో పాటు ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా పలువురు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా అధ్యక్షులు కుమార్ మాట్లాడుతూ బార్ అసోసియేషన్ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. కొత్త కోర్టు బిల్డింగ్ నిర్మాణం కోసం సీనియర్‌లను సమన్వయం చేసుకుంటూ కృషి చేస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో మాజీ సెక్రెటరీ శ్రీనివాస్ పాల్గొని నూతన కార్యవర్గానికి బాధ్యతలు అప్పగించారు.



ప్రమాణ స్వీకారం చేస్తున్న అనకాపల్లి బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గం


గోలీకాయలు ఆడుతున్న విద్యార్థులు

ఆటల్లో మునిగిన విద్యార్థులు

ప్రజాశక్తి -కశింకోట

వేసవి సెలవులు రావడంతో విద్యార్థులు ఆటల్లో నిమగ్నమయ్యారు. కొంత మంది విద్యార్థులు వేసవిలో నిర్వహించే కొన్ని రకాల తరగతులకు వెళ్తుండగా, చాలా మంది తమ స్నేహితులతో కలిసి వివిధ రకాల ఆటలు ఆడుతూ ఉల్లాసంగా గడుపుతున్నారు. ప్రధానంగా అమ్మమ్మ, నాన్నమ్మ, ఇతర బంధువుల ఊళ్లు వెళ్లి సెలవులను ఎంజాయ్ చేస్తున్నారు. ఇంకొంత మంది విహార యాత్రలకు మొగ్గు చూపుతున్నారు.

పెరిగిన బెండకాయల ధర

ఎండలకు తగ్గిన దిగుబడి

ప్రజాశక్తి-అచ్యుతాపురం

మండే ఎండలకు బెండకాయల పంట దిగుబడి తగ్గడంతో మార్కెట్లో బెండకాయలు ధర పెరిగింది. ఒక బస్తా బెండకాయలు ధర రూ.400 వరకు పలుకుతుండడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. సంక్రాంతి నుంచి మండలంలోని హరిపాలెం, కొండకర్ల, అందాలపల్లి, తిమ్మరాజుపేట తదితర గ్రామాల్లో బెండ తోటలు విస్తారంగా నాటారు. మెరక ప్రాంతాల్లో టమోటా పంట సాగు చేశారు. అన్ని కూరగాయల పంటల ఒకేసారి మార్కెట్‌కు రావడంతో వాటి ధరలు పడిపోయాయి. ఆరుగాలం కష్టించి పండించిన బెండ కాయలు మార్కెట్లో మంచి ధరకు అమ్ముడుపోతే రైతు ఆనందపడతాడు. కాని బస్తా బెండకాయలను రూ.100కు కూడా అమ్ముడయ్యేది కాదు. దీంతో రైతులకు నిరాశే ఎదురైంది. గిట్టుబాటు ధర లేకపోవడంతో రైతులకు శ్రమకు తగ్గ ఫలితం రాలేదు. రెండో విడతగా మార్చి మాసంతంలో నాటిన బెండతోటలు కాయలు కాస్తున్నాయి. చిల్లరగా అమ్మితే ఎక్కువగా లాభం వస్తుందని మహిళ రైతులు నేరుగా రూ.20, రూ.30, రూ.40 చొప్పున అమ్మకాలు చేస్తున్నారు. మరికొంత మంది బస్తాలతో తెచ్చి వ్యాపారులకు విక్రయిస్తున్నారు. ప్రస్తుతం మే నెలలో ఎండలకు పంటలు ఎండిపోయి దిగుబడి తగ్గింది. దీంతో ప్రస్తుతం ఒక బస్తా బెండకాయల ధర రూ.400 వరకు పలుకుతుందని హరిపాలెం గ్రామానికి చెందిన మారిశెట్టి సన్యాసినాయుడు, కాంగ్రెస్ లక్ష్మి తెలిపారు. ఇదే ధర కొనసాగితే తమకు గిట్టుబాటు అవుతుందని చెబుతున్నారు.


అచ్యుతాపురంలో సంతలో బెండకాయలు విక్రయిస్తున్న రైతులు


ఎన్‌డిఎ కూటమిదే విజయం

అనకాపల్లి జనసేన ఎమ్మెల్యే అభ్యర్థి కొణతాల

ప్రజాశక్తి- అనకాపల్లి

రాష్ట్రంలో జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం మీద వ్యతిరేకతతో సోమవారం జరిగిన ఎన్నికల్లో ప్రజలు ఎన్డీఏ కూటమికి ఓట్లు వేశారని అనకాపల్లి అసెంబ్లీ జనసేన అభ్యర్థి కొణతాల రామకృష్ణ పేర్కొన్నారు. స్థానిక రింగ్ రోడ్డులోని జనసేన పార్టీ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో ఓటర్లు రాత్రి ఒంటిగంట సమయం వరకు కొన్ని ప్రాంతాల్లో ఓటు హక్కు వినియోగించుకున్నారని, ప్రభుత్వంపై ఉన్న వ్యతిరేకతకు ఇదే నిదర్శనమని తెలిపారు. తప్పకుండా రాష్ట్రంలో కూటమి అధికారంలోకి వస్తుందని, కేంద్రంలో నరేంద్ర మోడీ మూడోసారి ప్రధానమంత్రి కావడం తథ్యమని చెప్పారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే తప్పకుండా ప్రజలకు సంక్షేమ పథకాలను అందిస్తామన్నారు. ఎన్నికల్లో సహకరించిన జనసేన, టిడిపి, బిజెపి నాయకులకు, కార్యకర్తలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. విలేకరుల సమావేశంలో డాక్టర్ కెకెవిఎ.నారాయణరావు, బిఎస్ఎన్‌కె.జోగినాయుడు పాల్గొన్నారు.


విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న అనకాపల్లి జనసేన ఎమ్మెల్యే అభ్యర్థి కొణతాల రామకృష్ణ


టిడిపి కార్యకర్త పుర్రె రాజును పరామర్శిస్తున్న యలమంచిలి జనసేన ఎమ్మెల్యే అభ్యర్థి సుందరపు

పుర్రె రాజుకు సుందరపు పరామర్శ

ప్రజాశక్తి-అచ్యుతాపురం

సార్వత్రిక ఎన్నికల పోలింగ్ సందర్భంగా మండల కేంద్రం అచ్యుతాపురంలో జరిగిన ఘర్షణలో గాయపడిన మోసయ్యపేట గ్రామానికి చెందిన టిడిపి కార్యకర్త పుర్రె రాజును ఎలమంచిలి నియోజకవర్గ జనసేన ఎమ్మెల్యే అభ్యర్థి సుందరపు విజయ్ కుమార్ మంగళవారం హాస్పిటల్‌కి వెళ్లి పరామర్శించారు. అచ్యుతాపురం హైస్కూల్లో సోమవారం పోలింగ్ సందర్భంగా వైసీపీ, టిడిపి కార్యకర్తల మధ్య ఘర్షణ జరిగింది. ఈ ఘర్షణలో టిడిపి కార్యకర్త పుర్రె రాజు చేతికి దెబ్బ తగిలింది. వైద్యం నిమిత్తం గాజువాకలోని ఓ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం రాజు హాస్పిటల్‌లో వైద్య సేవలు పొందుతున్నాడు. సుందరపు విజయ్ కుమార్ మంగళవారం హాస్పిటల్‌కి వెళ్లిరాజును పరామర్శించి, ఆయన తల్లిదండ్రులను ఓదార్చారు. ఘర్షణకు దారి తీసిన సంఘటనను ఆయన అడిగి తెలుసుకున్నారు. కూటమి పార్టీల కార్యకర్తలపై ఎటువంటి దాడులు జరిగిన ఉపేక్షించేది లేదని సుందరపు హెచ్చరించారు.

వ్యాపారవేత్త పీలా వెంకట జగ్గారావు మృతి

ప్రజాశక్తి- అనకాపల్లి

ప్రముఖ వ్యాపారవేత్త పీలా వెంకట జగ్గారావు స్థానిక గవరపాలెంలోని ఆయన స్వగృహంలో మంగళవారం మరణించారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. వెంకటజగ్గారావు పెద్ద కోడలు లక్ష్మీ సౌజన్య 81వ వార్డు కార్పొరేటర్‌గా వ్యవహరిస్తున్నారు. లిక్కర్ వ్యాపారంలో జగ్గారావు అందెవేసిన చేయి. ఆయన మూలంగా అనేకమంది వ్యాపార రంగంలో అడుగుపెట్టి ఆర్థికంగా స్థిరపడ్డారు. 1994లో అనకాపల్లి శాసనసభ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేసి ఓటమి చెందారు. మాజీ మంత్రి కొణతాల రామకృష్ణ అనుచరునిగా వ్యవహరించారు. నూకాంబిక అమ్మవారి ఆలయ చైర్మన్‌గా పనిచేశారు. జగ్గారావు హయాంలో ఆలయం అభివృద్ధి చెందింది. ఆయన మరణవార్త తెలిసి గవరపాలెంలో విషాద ఛాయలు అలముకున్నాయి. పలువురు ప్రముఖులు ఆయన మృతదేహానికి నివాళులర్పించారు. మంగళవారం మధ్యాహ్నం ఆయన అంతిమ యాత్ర జరుగుతుందని కుటుంబ సభ్యులు తెలిపారు.


పీలా వెంకట జగ్గారావు (ఫైల్‌ఫోటో)

హమ్మయ్య.. ఎలక్షన్ అయిపోయింది

ప్రజాశక్తి- బుచ్చయ్యపేట

రాష్ట్రంలోనూ, జిల్లాలోనూ సార్వత్రిక ఎన్నికలు ముగియడంతో రాజకీయ పార్టీల నాయకులు ఊపిరి పీల్చుకున్నారు. గత నెలన్నర కాలానికి పైగా గ్రామాల్లో రాజకీయ పార్టీల కార్యకర్తలు ఎన్నికల ప్రక్రియలో నిమగ్నమయ్యారు. రోజుల తరబడి గ్రామాల్లో ప్రచారం చేయడం, ఎత్తులు పైఎత్తులు వేసుకుంటూ గ్రామాల్లో కార్యకర్తలు బిజీబిజీగా ఉండేవారు. నెలల తరబడి పనిచేసిన గ్రామస్థాయి నాయకులు, కార్యకర్తలు సోమవారం ఎన్నికల పోలింగ్ ముగియడంతో ఊపిరి పీల్చుకుంటున్నారు.

చెట్టును కారు ఢీకొని మహిళ దుర్మరణం

మరో ఐదుగురికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి -చింతూరు

ఇన్నోవా కారు అదుపుతప్పి చెట్టును ఢీకొట్టిన ప్రమాదంలో ఒక మహిళ దుర్మరణం చెందగా, మరో ఐదుగురు తీవ్రంగా గాయపడ్డారు. వారిలో ఇద్దరు మహిళలు, ఇద్దరు పురుషులు, ఒక బాలుడు ఉన్నారు. వీరిది కృష్ణా జిల్లా గంపలగూడెం గ్రామం అని తెలుస్తోంది. మారేడుమిల్లి పర్యాటక కేంద్రాన్ని సందర్శించి తిరిగి వస్తుండగా భద్రాచలం -చింతూరు జాతీయ రహదారి-30 కాటుకపల్లి గ్రామ సమీపంలో వారు ప్రయాణిస్తున్న ఇన్నోవా కారు అదుపుతప్పి చెట్టును ఢీకొంది. ఈ ఘటనలో కారులో ప్రయాణిస్తున్న లక్ష్మి (46) అనే మహిళ అక్కడికక్కడే మృతి చెందారు. ప్రమాదాన్ని గమనించిన స్థానికులు వెంటనే కారులో ఇరుక్కున్న వారిని బయటకు తీసి, క్షతగాత్రులను ఏడుగురాళ్లపల్లి ఆసుపత్రికి తరలించారు.


సంఘటనా స్థలంలో చెట్టుకు ఢీకొన్న ఇన్నోవా కారు

క్షతగాత్రులకు సిపిఎం నేతల పరామర్శ

ప్రజాశక్తి -అనంతగిరి : ఓటేసేందుకు వచ్చి తిరుగు ప్రయాణంలో రోడ్డు ప్రమాదానికి గురై విశాఖ కెజిహెచ్‌లో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను అనంతగిరి సిపిఎం జెడ్‌పిటిసి దీసరి గంగరాజు, హుకుంపేట జెడ్‌పిటిసి రేగం మత్స్యలింగం మంగళవారం పరామర్శించారు. కెజిహెచ్‌లో వారికి అందుతున్న వైద్యసేవలపై వైద్యాధికారులను అడిగి తెలుసుకున్నారు. క్షతగాత్రులు త్వరితగతిన కోలుకునేలా మెరుగైన వైద్యసేవలు అందించాలని డాక్టర్లను కోరారు.

అధికారుల నిర్వాకం వల్లే ప్రమాదానికి ఆస్కారం

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సోమవారం జరిగిన ఎన్నికలలో వేలమాడి, పాటిపల్లి, దాయర్తి, గ్రామాల ఓటర్లంతా వేలమాడి పోలింగ్ బూత్‌లో ఓట్లు వేయాల్సి ఉన్నప్పటికీ, ఓటర్ల జాబితా సవరణ సమయంలో వారి పేర్లన్నీ వేరే బూత్‌లోకి మార్పు చేయడం వల్లే ఈ దుస్థితి తలెత్తిందన్నారు. వేలమాడిలో కాకుండా సుమారు 20 కిల్లోమీటర్ల దూరంలో ఉన్న పెదకోట బూత్‌లోకి వారి ఓట్లు తారుమారు కావడంతో, సోమవారం ఓటు వేసేందుకు బొలెరో వాహనంలో వెళ్లి తిరిగి వస్తుండగా ఈ ప్రమాదం జరిగిందన్నారు. అధికారుల నిర్లక్ష్యం, నిర్వాకం వల్లే ఈ ప్రమాదానికి ఆస్కారమేర్పడినందున వారే బాధ్యత వహించి క్షతగాత్రులకు మెరుగైన వైద్యసేవలతోపాటు ఆదుకునే చర్యలు చేపట్టాలని కోరారు. ఓటర్ల జాబితా సవరణలో బూత్‌లు తారుమారుకు కారణమైన అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఇటువంటి తప్పిదాలు పునరావృతం కాకుండా ఉండాలంటే బాధ్యులపై కఠినచర్యలు ఉండాలన్నారు. కార్యక్రమంలో కార్యకర్తలు పి. రాము, ఎన్.సురేష్ పాల్గొన్నారు



క్షతగాత్రురాలిని పరామర్శిస్తున్న జెడ్‌పిటిసి గంగరాజు

ప్రమాదభరితంగా నీటి ట్యాంకు



ప్రమాదకరంగా ఉన్న ఓవర్‌హెడ్ ట్యాంక్

ప్రజాశక్తి -కోటవురట్ల : మండలంలో పాములవాక పంచాయతీలో ప్రధాన రహదారిని అనుకుని పాఠశాల వద్ద ఉన్న 40వేల లీటర్ల సామర్థ్యం కలిగిన రక్షితనీటి పథకం వాటర్ ట్యాంక్ ప్రమాదకరంగా దర్శనమిస్తుంది, ఈ ట్యాంకు నిర్మాణం చేపట్టి ఎన్నోఏళ్లు పూర్తికావస్తుందని, దీంతో శిథిలావస్థకు చేరుకుని, ఈ క్షణాన ఎటువంటి ప్రమాదం ముంచుకొస్తుందని గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు, ప్రస్తుతం వాటర్ ట్యాంక్ నుంచి నీరు లీకై వథాగా పోవడంతో పాటు దిగువన పిల్లర్లు పాక్షికంగా దెబ్బతిన్నాయి, తక్షణమే అధికారులు రక్షితమంచినీటి పథకం ట్యాంకును పరిశీలించి, జీర్ణావస్థకు చేరుకుంటే తొలగించాలని, లేనిపక్షంలో నిధులు మంజూరు చేసి మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు. ఎటువంటి ప్రమాదం జరగకముందే అధికారులు స్పందించాలని కోరుతున్నారు.

సౌకర్యాల లేమితో అవస్థలు

- నిర్వహణను గాలికొదిలేసిన ఆర్‌టిసి అధికారులు
- ప్రకటనల్లో ఉన్న ఆర్భాటం బస్సుల్లో లేవు
- ఛార్జీల పెంపులో ఉన్న శ్రద్ధ సౌకర్యాలపై ఏదీ?
- అసహనం వ్యక్తం చేస్తున్న ప్రయాణికులు

ప్రజాశక్తి -కోటవురట్ల : ఆర్‌టిసి ప్రయాణం సుఖం, సురక్షితం అంటూ అధికారులు చేసిన ప్రకటనలు, స్లోగన్లుకు, బస్సుల్లో వాస్తవ పరిస్థితులకు ఎక్కడా పొంతన కుదరడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. అధికారులు చెప్పిన సౌకర్యాలు ఎక్కడా కనిపించడం లేదు. గతంలో నర్సీపట్నం నుండి విశాఖకు వెళ్లే బస్సుల్లో సౌకర్యవంతమైన సీట్లుతో పాటు ప్రయాణ సమయంలో వినోదం కోసం టీవీ ఏర్పాటు చేసేవారు, ప్రయాణికులకు తాగడానికి నీళ్లు సైతం అందుబాటులో ఉంచేవారు, ప్రధానంగా ఫస్ట్ ఎయిడ్‌కిట్లు బస్సుల్లో అందుబాటులో ఉండేవి.

కానీ ప్రస్తుతం ఆయా బస్సుల్లో సీట్లు బాగాలేదు, తాగేందుకు నీళ్లు లేవు, వినోదం కోసం టీవీ పనిచేయదు, రేట్లు మాత్రం ఒక్కసారిగా రూ.55 పెంచారు, గతంలో రూ.95 నుంచి రూ.105 వరకు ఉండేది, ప్రస్తుత రూ.150 చొప్పున ప్రయాణికుల ముక్కుపిండి ఛార్జీలు వసూలు చేస్తున్నారు. ఛార్జీలు పెంచిన ఆర్‌టిసి అధికారులు, ఆయా బస్సుల్లో సౌకర్యాలపై దృష్టి పెట్టడం లేదని ప్రయాణికులు వాపోతున్నారు. కొన్నేళ్లుగా అవే బస్సులు తిప్పడం, వాటి నిర్వహణ సరిగా లేకపోవడంతో ప్రయాణ సమయంలో బస్సులో విపరీతమైన శబ్దాలతో చిన్నారులు, వృద్ధులు, ఇతర ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు, నిత్యం ప్రయాణీకులతో రద్దీగా ఉండే నర్సీపట్నం నుండి విశాఖపట్నం మార్గంలో ఆర్‌టిసి బస్సుల్లో గడిచిన మూడేళ్లుగా ఇదే పరిస్థితి ఉండడంతో తీవ్ర అవస్థలకు గురైన ప్రయాణికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు, సంబంధిత అధికారులు ఎప్పటికైనా స్పందించి ప్రయాణం సురక్షితం చేయాలని పలువురు కోరుకుంటున్నారు.



నర్సీపట్నం, విశాఖ రూట్‌లోని ఆర్‌టిసి బస్సు లోపలి భాగం

వృథాగా సర్వే రాళ్లు!



రాజుపేట శివారు రామన్నపాలెం వద్ద వృథాగా పడి ఉన్న సర్వే రాళ్లు

ప్రజాశక్తి -కోటవురట్ల : మండలంలో రాజుపేట గ్రామానికి సంబంధించి సమగ్ర భూసర్వే గతేడాది క్రితమే పూర్తయినట్లు అధికారులు చెబుతున్నా, వాటికి సంబంధించిన భూ సర్వే రాళ్లు కొన్నిచోట్ల వథాగా పడి దర్శనమిస్తున్నాయి, లక్షల రూపాయల ప్రజాధనం వెచ్చించి, ఒక్కోరాయిని సుమారు రూ. 500 చొప్పున కొనుగోలు చేసిన అధికార యంత్రాంగం, ఆయా సర్వేరాళ్లను రాజుపేట శివారు రామన్నపాలెం శ్మశానం వద్ద వథాగా పడేశారు. అంతేకాదు సర్వే రాళ్లపాతేందుకు గుత్తేదారుడుకి ఒక్కొక్క రాయికి దాదాపు రూ.200 ఖర్చు చేసినట్లు తెలిసింది,ఈ విషయమై స్థానిక మండల సర్వేయర్ శ్రీనివాస్‌ను వివరణ కోరగా సర్వే పూర్తయిందని వథాగా ఉన్న రాళ్లను త్వరలో భద్రపరుస్తామన్నారు. ఎన్నికల విధుల నిర్వహణ, కోడ్ అమల్లో ఉన్నందున సిబ్బంది వివిధ పనులపై ఉన్నారన్నారు. ఎన్నికల ముగిసిన వెంటనే సిబ్బందితో మాట్లాడి, వాటిని భద్రపరుస్తామని తెలిపారు.

అర్ధాంతరంగా ఆగిన రోడ్డు నిర్మాణం

అల్లుమయ్యపాలెం గిరిజనం అవస్థలు

రియల్టర్లకు లబ్ధి చేకూరేలా సాగిన పనులు

ప్రభుత్వ భూములు అన్యాక్రాంతమైనా పట్టని వైనం



సగం వరకు నిర్మించి వదిలేసిన రోడ్డు నిర్మాణం

ప్రజాశక్తి- కోటవురట్ల : మండలంలో రామచంద్రపురం గ్రామ శివారు గిరిజనుల గ్రామమైన అల్లుముయ్యపాలెం గ్రామం రోడ్డు అర్ధాంతరంగా నిలిపేయడంపె గ్రామస్తులతోపాటు పలు సంఘాల నాయకులు విమర్శలు గుప్పిస్తున్నారు, గ్రామానికి రూ. 3 కోట్ల 30 లక్షల ఉపాధి హామీ నిధులతో సుమారు 5కిలోమీటర్లు రోడ్డు పనులు చేపట్టగా, గ్రామం వరకు వేసి అర్ధాంతరంగా నిలిపివేయడం, ప్రధానంగాకల్వర్టు నిర్మాణం చేపట్టకపోవడంతో ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీంతో కొండవాలు గెడ్డను దాటి వెళ్ళవలసి వస్తుందనిగిరిజనులు వాపోతున్నారు. అటవీ ఉత్పత్తులు ఫలసాయం తీసుకువచ్చేందుకు అవస్థలు పడుతున్నామని, అదేవిధంగా పాఠశాలకు ఇదే మార్గం కావడంతో కల్వర్టు లేక పిల్లలు గెడ్డ దాటి వెళ్లడం ప్రమాదకరమని ఆవేదన చెందుతున్నారు అంతేకాకుండా గ్రామంలో మరికొన్ని చోట్ల చేపట్టాల్సిన కల్వర్టుల నిర్మాణాలు నిలిపివేయడంపై గ్రామస్తులు అవస్థలు పడుతున్నారు,

ఈ గ్రామానికి వెళ్లే దారిలో రియల్టర్లు ఉండడంతో తమ భూముల విలువ పెంచుకునేందుకు తమకు అవసరమైనంత వరకు మాత్రమే రోడ్డు నిర్మాణం చేపట్టి తర్వాత వదిలేశారని అంటున్నారు. ప్రజాధనం ఉపాధి నిధులతో నిర్మించిన రోడ్డు అల్లు ముయ్యపాలెం గిరిజనులకా? లేకుంటే రియల్టర్ల సౌకర్యం ,వారికి లబ్ధి చేకూర్చేందుకు చేపట్టారాయని ప్రశ్నిస్తున్నారు. ఈ ప్రాంత గిరిజనులు కేవలం పోడు భూముల సాగుపైనే ఆధారపడి జీవనం సాగిస్తుండగా, తమ గ్రామాలకు వెళ్లేందుకు రోడ్డు సౌకర్యం లేదని ప్రభుత్వపరంగా నిధులు మంజూరు చేస్తే, వాటితో తమ భూముల వరకు పనులను జరిపించుకుని తర్వాత వదిలేయడంలో ఆంతర్యమేమిటని ప్రశ్నిస్తున్నారు. రోడ్డుకు ఆనుకుని, సమీపంలో ఉన్న భూములన్నీ రియల్టర్ల చేతుల్లోనే ఉండడంతో, వారికి లబ్ధి చేకూర్చేందుకు ఇలా నిర్మాణాలు చేపట్టి వదిలేశారని బాహాటంగానే విమర్శలు వినిపిస్తున్నాయి. రోడ్డు నిర్మాణం చేపట్టిన తర్వాత దీనికి సమీపంలో విలువైన ప్రభుత్వ భూములు కూడా అన్యాక్రాంతమయ్యాయన్న ఆరోపణలు ఉన్నాయి, ఎన్నికల తంతుకూడా ముగియడంతో, ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డు నిర్మాణ పనులు పూర్తి చేయాలని గిరి పుత్రులు కోరుకుంటున్నారు



కల్వర్టు నిర్మించాల్సిన ప్రదేశం

డబుల్ లైన్‌లో రైల్వే అధికారుల తనిఖీలు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : కోరాపుట్ - సింగాపూర్ రోడ్ డబ్లింగ్ ప్రాజెక్టులో భాగంగా లక్ష్మీపూర్ రోడ్ - సింగారం - టికిరి రైల్వే సెక్షన్ల మధ్య కొత్తగా నిర్మించిన 21.750 కిలోమీటర్ల డబుల్ లైన్‌ను సౌత్ ఈస్టర్న్ సర్కిల్ రైల్వే సేఫ్టీ కమిషనర్ బ్రిజేష్ కుమార్ మిశ్రా మంగళవారం పరిశీలించారు. ఆ మార్గంలో ప్రధాన, చిన్న వంతెనలు, వంపులు 25టి యాక్సిల్ లోడ్‌కు అనుగుణంగా నిర్మించబడ్డాయని ఆయనకు సిబ్బంది తెలిపారు. అనంతరం మంగళవారం నిర్వహించిన స్పీడ్ ట్రయల్స్ విజయవంతం కావడంతో ఈ మార్గం పూర్తి స్థాయి కమీషన్‌ను చేపట్టేందుకు అధికారులు అనుమతి మంజూరు చేశారు. తనిఖీల్లో వాల్తేర్ డివిజనల్ రైల్వే మేనేజర్ సౌరభ్ ప్రసాద్, చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ ఏజీ శ్రీనివాస్, చీఫ్ ఎలక్ట్రికల్ ఇంజినీర్ ఎం.సన్నన్‌వాలా, చీఫ్ బ్రిడ్జ్ ఇంజినీర్ విఎస్‌కె.రాజ్ కుమార్, చీఫ్ ఇంజినీర్ / కన్‌స్ట్రక్షన్ అశోక్ కుమార్, ఎడిఆర్‌ఎం (ఇన్‌ఫ్రా) సుధీర్ కుమార్ గుప్తా, డిప్యూటీ చీఫ్ ఇంజనీర్ / కన్‌స్ట్రక్షన్ విష్ణుమూర్తి, సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ కె.సందీప్ పాల్గొన్నారు.



రైల్వే పనులను పరిశీలిస్తున్న అధికారులు

పేటలో 82.41శాతం పోలింగ్

- పోలింగ్ కేంద్రాల వద్ద బారులు తీరిన ఓటర్లు
- సమయం ముగిసినా కొనసాగిన పోలింగ్
- దోసలపాడులో వేకువజాము వరకు ఓటింగ్

ప్రజాశక్తి -నక్కపల్లి : పాయకరావుపేట నియోజకవర్గంలో సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి సోమవారం జరిగిన 82.41 శాతం పోలింగ్ నమోదయింది .పాయకరావుపేట నియోజకవర్గం నాలుగు మండలాల్లో మొత్తం 2,50,744 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో పురుషులు 1,23,363, మహిళలు 1,27,379, ఇతరులు ఇద్దరు ఉన్నారు.సోమవారం జరిగిన ఎన్నికల్లో పురుషులు 1,02, 464, మహిళలు 1,04,161, ఇతరులు ఒక్కరు ఓటేయగా, మొత్తం 2,06,626 మంది ్ల ఓటు హక్కును వినియోగించుకున్నారు.

పాయకరావుపేట నియోజకవర్గంలో నక్కపల్లి, పాయకరావుపేట ఎస్ రాయవరం, కోట ఊరట్ల మండలాల్లో 292 పోలింగ్ కేంద్రాలు గలవు.పోలింగ్ ప్రారంభం నుండి ఓటర్లు పోలింగ్ కేంద్రాల వద్ద బారులు తీరారు. మండలంలోని దోసలపాడు పోలింగ్ కేంద్రంలో మంగళవారం తెల్లవారుజాము 3 గంటల వరకు పోలింగ్ కొనసాగింది .పోలింగ్ కేంద్రంలో పోలింగ్ ఆలస్యంగా జరగడంతో ఓటర్లు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. నక్కపల్లి, ఉపమాక, వెదుళ్ళ పాలెం తదితర గ్రామాల్లో సోమవారం రాత్రి సుమారుగా 10 గంటల వరకు పోలింగ్ కొనసాగింది. కొన్ని గ్రామాల్లో పోలింగ్ కేంద్రాల వద్ద పోలింగ్ ప్రక్రియ నెమ్మదిగా జరిగినప్పటికీ, ఓటర్లు మొక్కవోని దీక్షలో క్యూలైన్లలో వేచియుండి ఓటు హక్కును వినియోగించుకోవడం విశేషం. పలు గ్రామాల్లో పోలింగ్ కేంద్రాల వద్ద టెంట్లు ఏర్పాటు చేసినప్పటికీ చాలక పోవడంతో మండుటెండను సైతం లెక్కచేయకుండా నిలబడి తీవ్ర ఇబ్బందులు పడ్డారు.


ఉపమాకలో సమయం దాటిన తర్వాత కూడా ఓటు కోసం క్యూలో ఉన్న ఓటర్లు

పేటలో టిడిపిదే గెలుపు

ధీమా వ్యక్తం చేస్తున్న కూటమి నేతలు


పార్టీ ముఖ్య నేతలతో చర్చిస్తున్న అనిత

ప్రజాశక్తి- నక్కపల్లి : పాయకరావుపేట నియోజకవర్గంలో కూటమి బలపరిచిన టిడిపి అభ్యర్థి వంగలపూడి అనిత విజయకేతనం ఎగురవేయడం ఖాయమని టిడిపి ముఖ్య నేతలు ఆశాభావం వ్యక్తం చేశారు. మంగళవారం నక్కపల్లి క్రిష్ టౌన్ షిప్‌లోని పాయకరావ ుపేట కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి వంగలపూడి అనితను కలిశారు. నియోజకవర్గంలో పోలింగ్ సరళిని ఆమె దృష్టికి తీసుకెళ్లి, పలు అంశాలపై చర్చించారు
ఈ సందర్భంగా.పాయకరావుపేట నియోజకవర్గంలో నక్కపల్లి, పాయకరావుపేట, ఎస్ రాయవరం, కోటవురట్ల మండలాల పార్టీ అధ్యక్షులతో పోలింగ్ సరళి, ఓటింగ్ తీరుపై అనిత చర్చించారు .ఆయా మండలాలకు సంబంధించిన నేతలు గ్రామాల వారీగా రిపోర్టును అనిత దష్టికి తీసుకువెళ్లారు. లెక్కలు, సమీకరణలు వేసి, పాయకరావుపేట నియోజకవర్గంలో కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి వంగలపూడి అనిత, అనకాపల్లి ఎంపీగా బిజెపి అభ్యర్థి సీఎం రమేష్ భారీ మెజార్టీతో గెలవడం ఖాయమని నేతలు ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో టిడిపి ముఖ్య నేతలు కొప్పిశెట్టి వెంకటేష్ ,కొప్పిశెట్టి బుజ్జి ,పెద్దిరెడ్డి చిట్టిబాబు, అమలకంటి అబద్ధం, జానకి శ్రీను పాల్గొన్నారు.

మద్యం దుకాణాలు కిటకిట



మద్యం దుకాణం వద్ద బారులుదీరిన మందుబాబులు

ప్రజాశక్తి-కోటవురట్ల : సార్వత్రిక ఎన్నికలు సందర్భంగా ఈనెల 11న మూసివేసిన మద్యం దుకాణాలు సోమవారం ఎన్నికల తంతు ముగియడంతో మంగళవారం తెలుసుకున్నారు. పెద్దసంఖ్యలో మందుబాబులు మద్యం దుకాణాలకు పోటెత్తారు, ఉదయం నుండి బారులు తీరి మద్యాన్ని ఉత్సాహంగా కొనుగోలు చేసారు, అయితే కొన్ని షాపుల్లో నచ్చిన బ్రాండ్లు అందుబాటులో లేక మందుబాబులు నిరాశకు గురైనా,ఉన్న బ్రాండ్లతోనే సరిపెట్టుకున్నారు.

వెలగని వీధిదీపాలతో అవస్థలు

ప్రజాశక్తి -కోటవురట్ల : గడిచిన వారం రోజులుగా మండల కేంద్రంలో విద్యుత్ దీపాలు వెలగకపోవడంతో ఆయా ప్రాంత కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు భయాందోళనలకు గురవుతున్నారు, ప్రధానంగా ప్రధాన రహదారిని ఆనుకొని ఉన్న సీతారామరాజు నగర్ కాలనీలో వీధిలైట్లు సైతం సక్రమంగా వెలగకపోవడంతో విష సర్పాలు సంచరిస్తూ ఉన్నాయి, అధికారులకు పొలిమర్లు చెప్పిన పట్టించుకోలేదనొ ఆరోపణలు గుప్పిస్తున్నారు, అధికారులు స్పందించి వీధిలైట్లు నిర్వహణ సక్రమంగా ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని కోరుకుంటున్నారు.


వీధిదీపాలు లేక చిమ్మచీకట్లు

అడ్డురోడ్డు ప్రయాణం... అవస్థలమయం!

- నిండా గోతులు.. ఎక్కడికక్కడే మలుపులు
- రోడ్డును కమ్మేసేంతగా పిచ్చిమొక్కలు
- అవస్థలు పడుతున్న ప్రయాణికులు
- బిక్కుబిక్కుమంటూ వాహన రాకపోకలు


అడ్డురోడ్డులో ఉన్న భారీ ప్రమాదకర మలుపులు

ప్రజాశక్తి -కోటవురట్ల: అసలే గోతులు, ఆపై మలుపులు, దీనికి తోడు తుప్పలు.. ఇదీ కోటవురట్ల మండల కేంద్రం నుంచి అడ్డురోడ్డు వరకు వెళ్లే వాహనదారుల ప్రయాణ కష్టాలు. మండల కేంద్రం నుండి అడ్డరోడ్డు ప్రయాణం అంటే హడలిపోతున్నారు. అడ్డురోడ్డు వెళ్లే దారిలో రామచంద్రపురం నుండి అడ్డరోడ్డు వెళ్లే వరకు రోడ్డు అధ్వానంగా ఉండడంతో రాత్రి సమయంలో ప్రయాణం బిక్కుబిక్కుమంటూ వెళ్లాల్సి వస్తోందని వాపోతున్నారు. నిత్యం ఇదే మార్గంలో అధికారులు, నేతలు రాకపోకలు సాగిస్తున్నా వీరిలో ఏ ఒక్కరూ కనీసం రోడ్డు గురించి పట్టించుకోలేదని స్థానికులు తీవ్ర విమర్శలు గుప్పిస్తున్నారు, ఇందేసమ్మవాక వద్దనుండి అడ్డ రోడ్డు వెళ్లే వరకు ఏ క్షణాన ఏ ప్రమాదం సంభవిస్తుందోనని భారీ వాహనాలు సహా ద్విచక్ర వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు, పోలవరం కాలువ వద్ద రోడ్డు సమీపంలో ఆందోళనకరంగా నిర్మాణం కోసం తీసిన గొయ్యి ప్రమాదకరంగా దర్శనమిస్తుంది, రోడ్డుకు ఇరువైపులా విస్తరణ కోసం గోతుల తవ్వి వదిలేయడం కనీసం అధికారులు సైతం పట్టించుకోకపోవడం దారుణమంటూ ఆయా ప్రాంతవాసులు ఆవేదన చెందుతున్నారు. అధికారులు నాయకులు ఇప్పటికైనా స్పందించి అడ్డురోడ్డులో నెలకొన్న వాహన రాకపోకల కష్టాలపై దృష్టి పెట్టాలని కోరుతున్నారు.


నిండా గోతులమయమైన అడ్డురోడ్డు రోడ్డు

మంచం పట్టిన రాసకీల

- విషజ్వరాలతో గిరిజనం విలవిల
- పది రోజులైనా రోగులకు అందని వైద్యం
- కలుషిత నీరు తాగడం వల్లే ఈ దుస్థితి
- పాడైన బోరు బాగుచేయడంలో నిర్లక్ష్యం

ప్రజాశక్తి -అనంతగిరి : మండలంలోని పిన్నకోట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని రాసకీల గ్రామంలో విషజ్వరాలతో గిరిజనులు విలవిల్లాడిపోతున్నారు. పది రోజులైనా కనీస వైద్య సేవలు అందక జ్వరపీడితులు మంచం పట్టారని స్థానికులు ఆవేదన చెందుతున్నారు. కనీసం వైద్యసిబ్బంది అయినా వచ్చి తమను పట్టించుకోవడం లేదని, జ్వరంతో కాలినడకన వైద్యానికి వెళ్లలేక మగ్గిపోతున్నామని వాపోతున్నారు.
మండలంలోని రాసకీల గ్రామంలో సూకూరు జ్యోతమ్మ, సూపరు, సోమయ్య, సూకురు లక్ష్మయ్య ఇలా పలువురు రోగులు పది రోజులుగా విషజ్వరాలతో బాధపడుతున్నారు.సమస్యను సంబంధిత వైద్యసిబ్బంది దృష్టికి తీసుకెళ్లినప్పటికీ, ఎవరూ స్పందించకపోవడంతో పదిరోజులుగా నానా అవస్థలు పడుతున్నామని వాపోతున్నారు. అందరూ ఎన్నికల హడావిడిలో ఉండడంతో తమ గోడును వినిపించుకునే వారే లేకుండా పోయారని అంటున్నారు. వైద్యసేవలకు వెళ్లాలంటే, జ్వరంతో నీరసించి అస్వస్థులైన తాము కొండ కోనలను దాటుకుని కాలినడకన వెళ్లే పరిస్థితి లేదని, డోలీపై మోసుకెళ్లి తీసుకెళ్లే వారు లేరనిదీంతో మంచంలోనే మగ్గిపోతున్నామని రోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించాలని, రాసకీలలో జ్వరపీడితులకు తక్షణవైద్యసేవలు అందించేలా చర్యలు చేపట్టాలని వేడుకుంటున్నారు.

కలుషిత నీరు వల్లే జ్వరాలు

గత్యంతరం లేని పరిస్థితుల్లో గెడ్డల్లోని కలుషిత నీటిని వినియోగించడం వల్లే గిరిజనులు విషజ్వరాల బారిన పడుతున్నారని స్థానికులు అంటున్నారు. గ్రామంలో మంచినీరు అందించేందుకు నీటి పథకం ఉన్నప్పటికీ,దాని మోటారు పాడవ్వడంతో మరమ్మతులు చేసే దిక్కు లేకపోవడంతో గ్రామానికి దరిలో ఉన్న ఊటగెడ్డలోని నీటిని వాడుతున్నామని గిరిజనులు అంటున్నారు. ప్రస్తుతం వేసవి కాలంలో గెడ్డలోని నీరు ఇంకిపోవడం, కలుషితమైన ఆ నీటినే వాడాల్సిన దుస్థితిలో ఇలా విషజ్వరాల బారిన పడుతున్నామని ఆవేదన చెందుతున్నారు. అధికారులు స్పందించి తక్షణమే పాడైన నీటి పథకం మోటారుకు మరమ్మతులు చేసి వినియోగంలోకి తేవాలని కోరుతున్నారు.


వైద్యం అందక పది రోజులుగా మంచం పట్టిన లక్ష్మయ్య